E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com


29-3-2025 శనివారం | పేజీలు–6 | హైదరాబాద్

ekaburu.com



2లో

జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ నిజమైన రైతు నాయకుడు: సుప్రీం




## భారతదేశంలోని అత్యంత ప్రభావశీల వ్యక్తుల జాబిత

సెకండ్, థర్డ్ ప్లేస్ లలో అమిత్ షా, జైశంకర్
తొమ్మిదో స్థానంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ
28వ స్థానంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి
14వ ప్లేస్ లో చంద్రబాబు, 73వ స్థానంలో పవన్ కల్యాణ్
92వ స్థానంలో అల్లు అర్జున్, రోహిత్ శర్మకు 48వ స్థానం
మాజీ సీఎంలు కేసీఆర్, జగన్ కు దక్కని చోటు
ఇండియన్ ఎక్స్ ప్రెస్ ఐఈ–100 జాబితా రిలీజ్

2లో



## భూకంప తాకిడితో మయన్మార్ విలవిల..

# 150 దాటిన మృతుల సంఖ్య

- శిథిలాల కింద చిక్కుకున్న 800 మందికి పైగా గాయపడిన అవకాశం.
- బ్యాంకాక్‌లో భద్రత దృష్ట్యా ప్రతి భవనాన్ని తనిఖీ చేయనున్నట్లు ప్రకటింపు.
- మయన్మార్‌లో వైద్య సేవలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ సహాయ చర్యలు చేపట్టింది.
- థాయ్‌లాండ్ ప్రధాని అత్యవసర పరిస్థితిని ప్రకటించి రైలు, మెట్రో సేవలు నిలిపివేత.
- భూకంప బీభత్సం: మయన్మార్, థాయ్‌లాండ్ కుదేలయ్యాయి!
- 150 దాటిన మృతుల సంఖ్య: సహాయక చర్యలు ముమ్మరం!
- రిక్టర్ స్కేలుపై 7.7 తీవ్రత: భవనాలు, వంతెనలు కూలిపోయాయి!
- శిథిలాల కింద చిక్కుకున్నవారి కోసం గాలింపు చర్యలు!
- థాయ్‌లాండ్ అత్యవసర పరిస్థితి ప్రకటింపు, రవాణా సేవలు నిలిపివేత!

2లో



## అమెరికా పర్యటనకు రాహుల్ గాంధీ..!

**ఏప్రిల్ 19 నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అమెరికాలో పర్యటించనున్నట్లు సమాచారం.**

**ఈ-కబురు:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ వర్గాలు వెల్లడించినట్లు ఆంగ్ల మీడియాల్లో కథనాలు వస్తున్నాయి. ఆ కథనాల ప్రకారం.. ఏప్రిల్ 19 నుంచి రాహుల్ అగ్రరాజ్యం (USA)లో పర్యటిస్తారు. ఈసందర్భంగా ఆయన బ్రౌన్ యూనివర్శిటీని సందర్శిస్తారు. బోస్టన్‌లో ప్రవాస భారతీయులతోనూ ఆయన భేటీ అయ్యే అవకాశం ఉంది. అయితే, ఆయన యూఎస్‌లో ఎన్ని రోజులు పర్యటిస్తారనేది తెలియదు

తరువాయి 2లో



## ప్రపంచ వాణిజ్య సంస్థకు ట్రంప్ షాక్: నిధులకు కత్తెర..!

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకొన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థకు అమెరికా నుంచి అందాల్సిన నిధులను నిలిపివేశారు.**

2లో

## త్రిభాషా సూత్రాన్ని వ్యతిరేకిస్తూ విజయ్ పార్టీ తీర్మానం




**త్రిభాషా సూత్రం, డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తమిళగ వెట్రి కళగం పార్టీ తీర్మానాలను ఆమోదించింది.**

**ఈ-కబురు:** జాతీయ విద్యావిధానంలోని త్రిభాషా సూత్రం, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై కేంద్రం, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే వీటిని వ్యతిరేకిస్తూ.. తమిళగ వెట్రి కళగం పార్టీ (TVK) తీర్మానాలను ఆమోదించింది. శుక్రవారం తిరువన్మియూర్‌లో తొలి జనరల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో వక్ఫ్ సవరణ బిల్లుతో సహా మొత్తం 17 తీర్మానాలను ఆ పార్టీ ఆమోదించింది. ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు విజయ్ (Vijay) పాల్గొన్నారు.

**రోజుకు 5 గంటలు ఫోన్‌తోనే..!**

సమావేశంలో వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరాలని పార్టీ నిర్ణయించింది. తాము ద్విభాషా విధానానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపింది. విద్యావిధానంలో మూడు భాషల విధానం అమలు ప్రతిపాదన ఫెడరలిజానికి విరుద్ధమని, దీన్ని ఎప్పటికీ తాము అంగీకరించమని స్పష్టం చేసింది. ఈసందర్భంగా రాష్ట్రంలో డ్రగ్స్ వాడకం పెరిగిపోయిందని, దీన్ని నియంత్రించడంలో అధికార డీఎంకే ప్రభుత్వం విఫలమైందని ఆరోపించింది. ఉద్యోగులకు పాత పెన్షన్ పథకంపై ఆ పార్టీ తప్పుడు వాగ్దానాలు చేస్తోందని పేర్కొంది. శ్రీలంకలో అరెస్టైన భారతీయ మత్స్యకారుల సమస్యను తమిళగ వెట్రి కళగం పార్టీ (టీవీకే) లేవనెత్తింది. మత్స్యకారులకు అండగా ఉంటామని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది.



## సొంతగడ్డపై చిత్తుగా ఓడిన చెన్నై.. బెంగళూరుకు రెండో విజయం

6లో



## పటీదార్, డేవిడ్ మెరుపులు.. చెన్నై సూపర్ కింగ్స్ లక్ష్యం 197

3లో

## ఆసియా కరాటే పోటీలు2027ను నగరంలో నిర్వహించేందుకు కృషి

## మయన్మార్, బ్యాంకాక్‌లో భారీ భూకంపం.. ప్రధాని మోదీ ఆరా



**మయన్మార్, బ్యాంకాక్‌లో భూకంపాలపై భారత ప్రధాని మోదీ స్పందించారు. అవసరమైన సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.**

**ఈ-కబురు, ఢిల్లీ:**
మయన్మార్, థాయ్‌లాండ్ దేశాలను శుక్రవారం వరుస భూకంపాలు వణికించాయి. ప్రకంపనల ధాటికి థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో అనేక భవనాలు ధ్వంసమయ్యాయి. ఈ విపత్తుపై భారత ప్రధాని నరేంద్రమోదీ విచారం వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆయా

2లో



## నేను మలయాళం నేర్చుకుంటున్నా: ప్రియాంక గాంధీ

**కేరళ మాజీ సీఎం ఏకే ఆంటోనీ సూచన మేరకు తాను మలయాళం నేర్చుకుంటున్నానని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ పేర్కొన్నారు.**

**ఈ-కబురు:** తాను మలయాళం నేర్చుకుంటున్నానని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక

2లో

## ప్రతిభగల యువతే తెలంగాణకు అతి పెద్ద ఆస్తి: మంత్రి శ్రీధర్‌బాబు

**తెలంగాణ భావితరాల అవసరాలకు అనుగుణంగా సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏఐ ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.**



**ఈ-కబురు, హైదరాబాద్:**
తెలంగాణ భావితరాల అవసరాలకు అనుగుణంగా సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏఐ ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఉగాది తర్వాత 'ఏఐ ఫ్యూచర్ సిటీ'కి భూమి పూజ ఉంటుందన్నారు. 200 ఎకరాల విస్తీర్ణంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఏఐ సిటీని నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే అనేక దిగ్గజ టెక్ సంస్థలు ఆసక్తి వ్యక్తం చేశాయన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా దేశంలోని ఇతర రాష్ట్రాలకు ధీటుగా ఎమర్జింగ్ టెక్నాలజీస్ రంగంలో తెలంగాణ హబ్‌గా మారుతుందన్నారు. ''డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో ఇప్పటికే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను ప్రారంభించాం. త్వరలోనే క్వాంటం కంప్యూటింగ్‌లోనూ కేంద్రం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు

2లో



## విదేశీ సంస్థల కోసం చైనా ద్వారాలు మరింత తెరుచుకుంటాయి..: జిన్‌పింగ్

**చైనాలో విదేశీ సంస్థలు పెట్టుబడులు పెట్టాలని ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ కోరారు. ఆయన 40 మంది సీఈవోలతో భేటీ అయ్యారు.**

**ఈ-కబురు:** ఓ పక్క అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రేడ్ వార్ ప్రారంభిస్తే.. మరో వైపు చైనా అధినేత జిన్‌పింగ్ మాత్రం విదేశీ సంస్థలకు ఆహ్వానం పలుకుతున్నారు. బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్స్‌లో ప్రపంచ స్థాయి వ్యాపార దిగ్గజాలతో ఆయన నేడు భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో 40 మంది సీఈవోలు పాల్గొన్నారు. వీరిలో శాంసంగ్ చీఫ్ లీ జే యంగ్, హెడ్జ్ ఫండ్ బాస్ రే డాలియో, బ్లాక్‌స్టోన్ గ్రూప్ సీఈవో, టొయోటా, ఆస్ట్రాజెనికా, ఫెడ్‌ఎక్స్, సౌదీ అరామ్‌కో సంస్థల ఎగ్జిక్యూటివ్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ మాట్లాడుతూ 'ఏకపక్ష వైఖరి, రక్షణాత్మక వైఖరి' పెరుగుతోందని వ్యాపారవేత్తలను

2లో

## అర్హతనుబట్టి ఎంతమందికైనా రేషన్ కార్డులిస్తాం: మంత్రి ఉత్తమ్

**ఉగాది రోజున పేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పు రానుందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.**

**ఈ-కబురు, హుజూర్‌నగర్:**
ఉగాది రోజున పేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పు రానుందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పథకాన్ని మంత్రి ఉత్తమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. '' రాష్ట్రంలో 85 శాతం జనాభాకు సన్నబియ్యం అందనుంది. రేషన్ బియ్యాన్ని చాలామంది ఉపయోగించుకోవడం లేదు. దొడ్డు బియ్యం తినకుండా కొందరు బ్లాక్‌లో అమ్ముతున్నారు. బియ్యంతో పాటు త్వరలోనే పప్పు, ఉప్పు లాంటి ఇతర సరకులు ఇస్తాం. రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఏర్పాటు చేశాం. కొత్త రేషన్ కార్డులు ఎంతమందికి కావాలన్నా అర్హతను బట్టి ఇస్తున్నాం. కార్డు లేకున్నా లబ్ధిదారుల జాబితాలో పేరు ఉంటే బియ్యం ఇస్తాం. రేషన్ బియ్యంపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఏటా రూ.10,665 కోట్లు ఖర్చు చేస్తున్నాయి'' అని ఉత్తమ్ తెలిపారు.



# అమెరికా పర్యటనకు రాహుల్ గాంధీ..!

మొదటి పేజీ తరువాయి

అంతేకాక.. దీనిపై పార్టీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.

**థాయ్‌లాండ్, శ్రీలంకల్లో పర్యటించనున్న ప్రధాని మోదీ**

ఇక, గతేడాది సెప్టెంబరులో మూడ్రోజులు రాహుల్ యూఎస్‌లో పర్యటించారు. ఆ సమయంలో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో రిజర్వేషన్లు, భారత్‌లో మత స్వేచ్ఛ వంటి అంశాలపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ప్రస్తుతం భారత్‌లో ఆదివాసీలు, దళితులు, ఓబీసీలకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని రాహుల్ అన్నారు. అప్పటివరకు అభివృద్ధిలో వారి భాగస్వామ్యం కూడా అంతంత మాత్రంగానే ఉంటుందని, దేశంలో అన్నివర్గాల వారికీ పారదర్శకంగా అవకాశాలు లభించే పరిస్థితులు వచ్చిన తర్వాతే రిజర్వేషన్ల రద్దు గురించి తమ పార్టీ ఆలోచిస్తుందన్నారు.

ఇక, సిక్కులను ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. భాజపా ఆయన మాటలను ఖండించింది. విదేశాల్లో భారత్ పరువుతీస్తున్నారని మండిపడింది. సిక్కులను ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా.. భాజపా మద్దతున్న ఒక గ్రూప్ దిల్లీలోని సోనియాగాంధీ నివాసం వెలుపల నిరసనలు సైతం తెలియచేసింది.

# ప్రపంచ వాణిజ్య సంస్థకు ట్రంప్ షాక్: నిధులకు కత్తెర..!

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకొన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థకు అమెరికా నుంచి అందాల్సిన నిధులను నిలిపివేశారు.**

**ఈ-కబురు:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకొన్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)కు అమెరికా నుంచి వెళ్లే నిధులను ఆయన కత్తిరించారు. ఈ విషయాన్ని ఓ ఆంగ్ల వార్తా సంస్థ వెల్లడించింది. ట్రంప్ కార్యవర్గం అనుసరిస్తున్న వ్యాపార రక్షణాత్మక వైఖరిని మరింత బలోపేతం చేసుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకొన్నారు.

ట్రంప్ అధికారంలోకి వచ్చింది మొదలు ప్రపంచస్థాయి వేదికల నుంచి అమెరికాను పక్కకు తప్పిస్తున్నారు. ఈక్రమంలో ఆయన ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి అమెరికా వైదొలిగినట్లు ప్రకటించారు. తాజాగా డబ్ల్యూటీవోకు నిధులను నిలిపివేశారు. దీంతోపాటు అనేక దేశాలకు అందించే విదేశీ సాయాన్ని కూడా ఆయన నిలిపివేశారు.

వాస్తవానికి 2019లోనే ట్రంప్ డబ్ల్యూటీవోను బలహీన పర్చారు. నాడు ఆ సంస్థలో న్యాయమూర్తుల నియామకాలను ఆయన నిలిపివేశారు. దీంతో ఆ సంస్థ వివాద పరిష్కార వేదిక విభాగం బలహీన పడిపోయింది. ఇది తరచూ తన పరిధిని దాటి మరీ తీర్పులు ఇస్తోందని ఎప్పటినుంచో వాషింగ్టన్ ఆరోపిస్తోంది. 2024లో డబ్ల్యూటీవో నిర్వహణకు 232 మిలియన్ డాలర్లు ఖర్చయ్యాయి. ప్రపంచ వాణిజ్యం ప్రతి దేశం వాటా ఆధారంగా ఈ సంస్థకు నిధులు సమకూరుస్తారు. ఇక అమెరికా నుంచి దీనికి దాదాపు 11శాతం అందుతాయి.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన అదనపు సుంకాలు ఏప్రిల్ 2వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. మరోవైపు ఈ వారమే అమెరికా దిగుమతి చేసుకొనే కార్లపై 25శాతం సుంకాలను ప్రకటించారు. ఈనేపథ్యంలో ఆయన అమెరికాను డబ్ల్యూటీవో నుంచి పక్కకు తెస్తారనే ప్రచారం జోరందుకొంది. అక్టోబర్ 2 నుంచి ట్రంప్ లిబరేషన్ డే అని అభివర్ణిస్తున్నారు.

కొత్త పన్నుల నుంచి అమెరికా ప్రభుత్వానికి 100 బిలియన్ డాలర్ల ఆదాయం రానుందని శ్వేతసౌధం వర్గాలు అంచనా వేశాయి. కాకపోతే ఈ నిర్ణయాలు ప్రపంచ పంపిణీ వ్యవస్థలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే అమెరికా నిర్ణయాలను డబ్ల్యూటీవోలో సవాలు చేస్తామని చైనా వెల్లడించింది.

# నేను మలయాళం నేర్చుకుంటున్నా

మొదటి పేజీ తరువాయి

గాంధీ వాద్రా పేర్కొన్నారు. వయనాడ్ ఎన్నికల ప్రచారం సమయంలో మాజీ సీఎం ఏకే ఆంటోనీ తనకు ఓ సూచన చేశారని అన్నారు. వయనాడ్ ప్రజలకు దగ్గరవ్వాలన్నా.. వారి కష్టాలు తెలుసుకోవాలన్నా.. అక్కడి ప్రజల మాతృభాష నేర్చుకోవాలని ఆయన చెప్పారన్నారు. నాటి నుంచి ఓ టీచర్‌ను పెట్టుకొని మరీ తాను మలయాళం నేర్చుకుంటున్నానని.. ప్రస్తుతం కొంత వరకు మాట్లాడగలుగుతున్నానని తెలిపారు.

అమెరికా పర్యటనకు రాహుల్ గాంధీ..!
వయనాడ్‌లోని వడక్కనాడ్ ప్రాంతంలోని గిరిజన స్థావరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె పాల్గొని, ప్రసంగించారు. తన నానమ్మ, దివంగత ప్రధాని ఇందిరా గాంధీకి గిరిజన సమాజం పట్ల ఎంతో గౌరవం ఉండేదని గుర్తుచేసుకున్నారు. గిరిజనలు పాటించే సామరస్య జీవన విధానం, అడవికి ఇచ్చే గౌరవం గురించి ఆమె తరచూ తమకు చెప్పేవారన్నారు. గిరిజనులను కలిసినప్పుడు వారు ఏదైనా బహుమతి ఇస్తే.. దాన్ని ఎంతో జాగ్రత్తగా ఆమె దాచుకునే వారని చెప్పారు. ప్రస్తుతం మ్యూజియంగా ఉన్న ఆమె ఇంటిని సందర్శిస్తే నేటికీ అటువంటి ఎన్నో వస్తువులను అక్కడ చూడొచ్చని పేర్కొన్నారు.

వయనాడ్ ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న తాగునీరు, రోడ్డు సమస్యలను పరిష్కరించడానికి నిధులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నానని ప్రియాంక అన్నారు. ఈ సమస్యలపై మరోసారి సంబంధిత మంత్రులను కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 2024 డిసెంబర్‌లో లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో వయనాడ్ నుంచి ఆమె భారీ మెజారిటీతో విజయం సాధించిన విషయం తెలిసిందే.

# భారతదేశంలోని అత్యంత ప్రభావశీల వ్యక్తుల జాబిత

**హైదరాబాద్:** ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మోస్ట్ పవర్ ఫుల్ ఇండియన్స్ జాబితా రిలీజైంది. వరుసగా మరోసారి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ టాప్ పొజిషన్ లో నిలిచారు. జవహర్ లాల్ నెహ్రూ తర్వాత మూడోసారి కేంద్రంలో పగ్గాలు చేపట్టడం ఆయన పట్ల ప్రజాదరణ తగ్గకుండా చేసిందని నివేది తెలిపింది. రెండో స్థానంలో అమిత్ షా, మూడో స్థానంలో కేంద్రమంత్రి జైశంకర్, నాలుగో స్థానంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ నిలవగా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 9వ స్థానంలో నిలిచారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, ఐకానిక్ స్టార్ అల్లుఅర్జున్ కు జాబితాలో చోటు దక్కింది.

**28వ స్థానంలో సీఎం రేవంత్ రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐఈ 100 లో 28 వస్థానంలో నిలిచారు. గతంలో ఆయన స్థానం 38గా ఉండేది. పది ర్యాంకులు మెరుగు పడటం విశేషం. 2021లో టీపీసీసీ చీఫ్‌గా నియమితులైన తర్వాత పార్టీలో అసంతృప్తిని ఎదుర్కోవడంతోపాటు వర్గ పోరుతో కూడిన కాంగ్రెస్ పార్టీని 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయంవైపు నడిపించారని ఈ నివేదిక పేర్కొన్నది. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్‌ను ఓడించి ఆ పార్టీకి షాకిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో రేవంత్‌రెడ్డి బయటివ్యక్తి అని కనిపించినప్పటికీ ఆ విమర్శలన్నింటినీ దాటుకుని పార్టీని విజయతీరంవైపు నడిపినట్లు ఈ రిపోర్టు తెలిపింది. ఆరు గ్యారెంటీల హామీ అమలు ఆయన ముందున్న ప్రధానమైన సవాలు అని పేర్కొంది ఐఈ-100 నివేదిక. యాక్టివ్ అవుతున్న బీజేపీని ఎదుర్కోవడం ఆయనకు సవాలు అని తెలిపింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన పార్టీని గెలిపించుకోవాల్సి ఉందని సూచించింది.

**14వ ప్లేస్ చంద్రబాబు, పవన్ కు 73ర్యాంకు**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు జాబితాలో 14వ స్థానం దక్కింది. వైసీపీని ఓడించేందుకు కూటమి అవసరమని గ్రహించిన చంద్రబాబు, 2024 ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో పొత్తుపెట్టుకొని విజయం సాధించారని తెలిపింది. గత ఏడాది జాబితాలో కనిపించని చంద్రబాబు ఈ సారి ఏకంగా 14వ ప్లేస్‌లో నిలవడం విశేషం. మళ్లీ జాతీయ రాజకీయాల్లో కీలక మిత్రపక్షంగా నిలిచారు. స్వర్ణాంధ్ర@2047ను అమలు చేయడం, సూపర్ 6 హామీలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఈ నివేదిక పేర్కొన్నది. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గతేడాది ఈ జాబితా చోటు లేకపోయినా ఈసారి 73వ స్థానంలో నిలిచారు.

**కేసీఆర్, జగన్‌కు దక్కని చోటు..**

జాబితాలో తెలంగాణ, ఏపీ తాజా మాజీ సీఎంలు కేసీఆర్, జగన్‌కు చోటు దక్కలేదు. బీహార్‌లో అధికారంలో లేకపోయినా ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ 86, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్‌కు 87వ స్థానాలు దక్కాయి. ఇటీవల ఢిల్లీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేఖా గుప్తా ఈ జాబితాలో 65వ స్థానం సాధించడం విశేసం

**బన్నీకి 92, రోహిత్ శర్మకు 48**

పుష్ప-2 సినిమాతో ప్రపంచ స్థాయిలో సత్తా చాటిన అల్లు అర్జున్ కు ఈ జాబితాలో 92వ స్థానం దక్కడం విశేషం. బన్నీ మినహా మిగతా టాలీవుడ్ నటులెవరికీ స్థానం దక్కలేదు. క్రికెటర్లలో రోహిత్ శర్మ 48, విరాట్ కోహ్లీకి 72, బుమ్రా 83 స్థానం దక్కించుకున్నారు. అలియా బట్ 100 ర్యాంక్‌లో ఈ జాబితాలో ఆఖరిలో నిలిచారు. వీరితోపాటు 10, 11వ స్థానాల్లో ముకేశ్ అంబానీ, గౌతం అదానీలు నిలిచారు. చెస్ విశ్వనాథ్, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నాతో పాటు తదితరులు జాబితాలో చోటు దక్కించుకున్నారు.

# స్పోర్ట్స్ అథారిటీ అధికారుల అత్యుత్సాహం

- పార్టీ కార్యక్రమాన్ని తలపించిన కరాటే ఛాంపియన్ షిప్
- 'సింగమోలే కదిలినాడు' పాటకు స్కూల్ విద్యార్థులతో డ్యాన్సులు చేయించిన అధికారులు
- స్థానిక కార్పొరేటర్ కు అందని ఆహ్వానం - స్టేజీపై కాంగ్రెస్ నాయకులకు స్థానం


గచ్చిబౌలి స్టేడియంలో కొనసాగుతున్న కరాటే ఛాంపియన్ షిప్

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు స్వామి భక్తిని ప్రదర్శించి విమర్శలను ఎదుర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన క్రీడోత్సవాల్లో పార్టీ పాటలను ప్రదర్శించి, సదరు పాటలకు అనుగుణంగా స్కూల్ విద్యార్థులతో డాన్సులు చేయించారు. జాతీయ కరాటే క్రీడా వేదికపై 'సింగమోలే కదిలినాడు కాంగ్రెస్ సూరీడు' అంటూ రేవంత్ రెడ్డి మీద రూపొందించిన కాంగ్రెస్ పార్టీ పాటను ప్రదర్శించి... సదరు పాటకు అనుగుణంగా క్రీడాకారులతో డ్యాన్సులు చేయించారు. ప్రభుత్వ నిధులతో నిర్వహించిన క్రీడా వేదికపై పార్టీ నాయకులకు స్థానం కల్పించి స్థానిక కార్పొరేటర్ కు కనీస ఆహ్వానం అందించకుండా విమర్శలను ఎదుర్కొన్నారు. గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి స్టేడియంలో 4వ కియో నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ, కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ ఛాంపియన్ షిప్ ను నిర్వహిస్తున్నారు. ఈ ఛాంపియన్ షిప్ వేడుకల్లో భాగంగా శుక్రవారం స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు స్కూళ్లకు చెందిన విద్యార్థులను భారీ ఎత్తున తీసుకువచ్చి ఇండోర్ స్టేడియంను నింపారు. కాగా ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతాడని మొదట భావించినా అనివార్య కారణాల కారణంగా ముఖ్యమంత్రి రాలేదు. ఇదే కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ ప్రసాద్ కుమార్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. కార్యక్రమ నిర్వహణలో భాగంగా స్పోర్ట్స్ అథారిటీ అధికారులు స్వామి భక్తిని ప్రదర్శించడం కోసం అత్యుత్సాహాన్ని చాటుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమంలో ఏకంగా రేవంత్ రెడ్డిపై రూపొందించిన కాంగ్రెస్ పార్టీ గీతాన్ని ప్రదర్శించి అభాసుపాలయ్యారు. 'మూడు రంగుల జెండా పట్టి సింగమోలే కదిలినాడు కాంగ్రెస్ సూరీడు' అంటూ రేవంత్ రెడ్డి, సోనియా గాంధీ, రాహుల్ గాంధీల మీద రూపొందించిన కాంగ్రెస్ పార్టీ పాటను ప్రదర్శించి, సదరు పాటకు అనుగుణంగా విద్యార్థులతో డ్యాన్సులు... కేరింతలు కొట్టించారు. స్కూల్ విద్యార్థులను పార్టీ పాటకు జేజేలు కొట్టిస్తూ, డాన్సులు చేయించడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. మరోవైపు కార్యక్రమ వేదికపై ప్రోటోకాల్ కు అనుగుణంగా స్థానిక గచ్చిబౌలి కార్పొరేటర్ కు ఆహ్వానం అందకపోగా.. కాంగ్రెస్ పార్టీకి చెందిన పక్క డివిజన్ల కు చెందిన కార్పొరేటర్లు, నాయకులు ఆసీనులు కావడం తీవ్ర విమర్శలకు కారణమైంది. వేదికపై కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇతర డివిజన్ల కార్పొరేటర్లు కూర్చోగా, స్థానిక కార్పొరేటర్ కనిపించ లేదు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన జాతీయ క్రీడోత్సవాల్లో పార్టీ పాటలు ప్రదర్శించి, అందుకు అనుగుణంగా క్రీడాకారులతో డ్యాన్సులు చేయించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.





# జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ నిజమైన రైతు నాయకుడు: సుప్రీం

**రైతుల డిమాండ్ల సాధన కోసం రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్‌ను అత్యున్నత న్యాయస్థానం ప్రశంసించింది.**

**ఈ-కబురు, ఢిల్లీ:**
రైతుల డిమాండ్ల సాధన కోసం రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ నిరవధిక నిరసన కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. పంజాబ్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అంగీకరిస్తూ.. శుక్రవారం ఆయన నీటిని స్వీకరించి తన దీక్షను విరమించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఖనౌరి, శంభు సరిహద్దుల్లో నిరసన తెలుపుతున్న వారిని చెదరగొట్టి రహదారులను తెరిచినట్లు పేర్కొంది. రైతుల డిమాండ్ల సాధన కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన దల్లేవాల్‌ను అత్యున్నత న్యాయస్థానం ప్రశంసించింది.

రైతులకు మంచి చేయాలనే ఆలోచన తప్ప.. ఆయనకు ఎలాంటి రాజకీయ అజెండా లేదని పేర్కొంది. అతడు నిజమైన కర్షక నాయకుడని కీర్తించింది. క్షేత్రస్థాయిలో ప్రస్తుత పరిస్థితికి సంబంధించిన నివేదికను సమర్పించాలని పంజాబ్, హరియాణా ప్రభుత్వాలను ఆదేశించింది. రైతుల ఫిర్యాదులను పరిశీలించి, అక్కడి స్థితిని తెలియజేసే నివేదికలను దాఖలు చేయాలని మాజీ హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలోని ఉన్నతాధికార కమిటీని కోరింది. దల్లేవాల్‌కు వైద్యసహాయం అందించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాన్ని పాటించనందుకు పంజాబ్ ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌పై విధించిన కోర్టు ధిక్కార చర్యలను కూడా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది.

భావ ప్రకటనా స్వేచ్ఛను రక్షించడం కోర్టుల విధి: కాంగ్రెస్ ఎంపీ వీడియో కేసులో సుప్రీం వ్యాఖ్యలు
పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం వంటి డిమాండ్లతో నవంబరు 26 నుంచి జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ పంజాబ్‌హరియాణా సరిహద్దులోని ఖనౌరీ శిబిరం వద్ద నిరవధిక నిరసన దీక్ష చేపట్టారు. దీంతో రోజురోజుకీ ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో వైద్యసహాయం అందించాలని సుప్రీం అక్కడి ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అయితే దల్లేవాల్‌కు వైద్యం అందించడానికి వెళ్తే రైతు సంఘాలు అడ్డుకుంటున్నాయని, కనీసం ఐవీ ఫ్లూయిడ్స్‌నైనా ఇచ్చేందుకు వీలుచిక్కడం లేదని పంజాబ్ ప్రభుత్వం పలుమార్లు నిస్సహాయత వ్యక్తం చేసింది. రైతు ప్రతినిధులతో చర్చలకు కేంద్రం అంగీకరిస్తే వైద్యసాయం పొందడం తనకు సమ్మతమేనని రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ దల్లేవాల్ ఇటీవల ప్రకటించారు.

# 150 దాటిన మృతుల సంఖ్య

**భారీ భూకంపం ధాటికి మయన్మార్ విలవిల్లాడుతోంది. వరుస భూకంపాల తీవ్రతకు మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది.**



**ఈ-కబురు:** భారీ భూకంపం ధాటికి మయన్మార్, థాయ్‌లాండ్ విలవిల్లాడుతున్నాయి. నిమిషాల వ్యవధిలో సంభవించిన వరుస భూకంపాల తీవ్రతతో మయన్మార్‌లో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ రెండు దేశాల్లో మృతుల సంఖ్య ఇప్పటివరకు 153కి చేరింది. మయన్మార్‌లోనే భారీగా ప్రాణనష్టం చోటుచేసుకోగా.. థాయ్‌లాండ్‌లో ఐదుగురు మృత్యువాత పడ్డారు. శిథిలాల కింద చిక్కుకొని 800 మందికి పైగా గాయపడటంతో.. మృతుల సంఖ్య భారీగా ఉండే అవకాశం ఉంది. థాయ్‌లాండ్‌లో భవన శిథాలాల కింద చిక్కుకొని 90 నుంచి 110మంది గల్లంతైనట్లు సమాచారం. కూలిన ఎత్తైన భవనాల కింద చిక్కుకొని హాహాకారాలు చేస్తున్నవారిని రక్షించేందుకు సహాయక చర్యలను ముమ్మరం చేశారు.

బ్యాంకాక్‌లోని ప్రతి భవనాన్ని భద్రత దృష్ట్యా తనిఖీ చేయాల్సి ఉంటుందని థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్ర అన్నారు. పరిస్థితిని పర్యవేక్షించి, సహాయక చర్యలు చేపట్టాలని ఆమె సంబంధిత సంస్థలను ఆదేశించారు. మయన్మార్, థాయ్‌లాండ్‌లలో భూకంపంతో క్షతగాత్రులైన వారికి చికిత్స అందించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ముందుకొచ్చింది. దుబాయిలోని తన లాజిస్టిక్స్ హబ్‌ను సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించింది. భూకంప ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు తమ కుటుంబ సభ్యులతోపాటు సర్వం కోల్పోయి రోదిస్తున్న దృశ్యాలు అందరినీ కలచివేస్తున్నాయి.

మయన్మార్‌లోని నేపిడాలో వెయ్యి పడకల ఆస్పత్రి, మాండలే నగరంలో ఐకానిక్ వంతెన, పలుచోట్ల ఎత్తైన ఆలయాలు, గోపురాలు భూకంప తీవ్రతకు కుప్పకూలాయి. బ్యాంకాక్‌లోని నిర్మాణంలో ఉన్న ఎత్తైన వంతెన కూలడంతో 90 మంది గల్లంతైనట్లు థాయ్‌లాండ్ రక్షణ మంత్రి ప్రకటించారు. శుక్రవారం రిక్టర్ స్కేలుపై 7.7 తీవ్రతతో సంభవించిన భూకంపం ధాటికి మయన్మార్, థాయ్‌లాండ్‌లోని పలు భవంతులు కుప్పకూలిపోయాయి. మయన్మార్ రాజధాని నగరం నేపిడాలో ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి.

బ్యాంకాక్‌లో భూప్రకంపనలతో ఓ భారీ భవంతి పైఅంతస్తులో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లోని నీరు కిందకు పడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ప్రస్తుతం భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో థాయ్‌లాండ్‌లో ప్రధాని షినవత్ర అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. బ్యాంకాక్‌లో మెట్రో, రైలు సేవలను నిలిపివేశారు.

**మయన్మార్ గర్భంలో ఏముంది?.. ఏమిటీ సగాయింగ్ ఫాల్ట్?**

మయన్మార్‌లో భూకంప విలయం కారణంగా ఎత్తైన భవంతులు, పురాతన వంతెనలు సహా అనేక కట్టడాలు కుప్పకూలిపోయాయి. ప్రాణ నష్టం కూడా భారీగా ఉంది. మయన్మార్‌లో చోటుచేసుకున్న తీవ్ర భూకంపం మరోసారి ఉలిక్కిపడేలా చేసింది. ఈ విలయం కారణంగా ఎత్తైన భవంతులు, పురాతన వంతెనలు సహా అనేక కట్టడాలు కుప్పకూలిపోయాయి. ప్రాణ నష్టం కూడా భారీగానే ఉంది. భూకంప కేంద్రం మధ్య మయన్మార్‌లో ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇది 'సగాయింగ్ ఫాల్ట్'కు సమీపంలో ఉంటుంది. అసలేమిటీ ప్రాంతం..? ఇక్కడే ఎందుకు తరచూ భూకంపాలు సంభవిస్తున్నాయి..?

**ఏమిటీ సగాయింగ్ ఫాల్ట్..?**

సాధారణంగా భూమి పైపొరలో అనేక ఫలకాలు (టెక్టానిక్ ప్లేట్స్) ఉంటాయి. వీటి సరిహద్దులను ఫాల్ట్స్ అంటారు. ఈ ఫలకాల మందం కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది. ఇవి నిరంతరం ఒకదానితో ఒకటి ఢీకొంటుంటాయి. ఇండియన్ టెక్టానిక్ ప్లేట్, బర్మా మైక్రోప్లేట్‌ల మధ్య సగాయింగ్ ఫాల్ట్ ఉంటుంది. మయన్మార్‌లో ఇది దాదాపు 1200 కి.మీల మేర విస్తరించింది.

భూ ఫలకాలు ఎప్పుడూ కదులుతుంటాయి. ఈ కదలికలు సగాయింగ్ ఫాల్ట్‌లో ఏడాదికి 11 మి.మీ నుంచి 18 మి.మీ వేగంగా జరుగుతున్నట్లు శాస్త్రవేత్తలు అంచనా వేశారు. 18 మి.మీ అంటే చాలా ఎక్కువ అని, దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. ఇవి దీర్ఘకాలం కొనసాగుతుండటంతో.. కాలక్రమేణా అంచుల వద్ద రాపిడికి గురై ఒత్తిడి పెరుగుతుంది. ఇది ఒక్కసారిగా భూకంపానికి దారితీస్తుంది. ఒత్తిడి మరీ ఎక్కువ ఉంటే పగుళ్లు ఏర్పడతాయి. భూకంప కేంద్రం లోతు ఎంత తక్కువగా ఉంటే.. నష్టం అంత ఎక్కువగా ఉంటుంది. ఇలా ఫలకాలు వేగంగా ఘర్షణకు లోనవుతున్న కారణంగానే మయన్మార్ ప్రాంతంలో తరచూ భూకంపాలు చోటుచేసుకుంటున్నాయి.

**గతంలో భయానక ఘటనలు..**

సగాయింగ్ ఫాల్ట్ కారణంగా మయన్మార్‌లో గతంలో అనేక భూకంపాలు సంభవించాయి. రెడ్ జోన్‌లో ఉన్న ఈ ప్రాంతంలో గత వందేళ్లలో 6 తీవ్రత కంటే ఎక్కువగా 14 భూకంపాలు వచ్చినట్లు అంచనా. 1946లో 7.7 తీవ్రతతో రాగా.. 1956లోనూ 7.1 తీవ్రతతో భూమి కంపించింది. 1988లో షాన్‌లో, 2004లో కోకో ద్వీపంలో వచ్చిన బలమైన ప్రకంపనలతో వందలాది మంది చనిపోయారు. 2011లో టార్లేలో వచ్చిన భూకంపంలో 151 మంది ప్రాణాలు కోల్పోయారు, 2016లోనూ 6.9 తీవ్రతతో రాగా.. తాజాగా 7.7 తీవ్రతతో ఇది సంభవించింది.

## మయన్మార్, బ్యాంకాక్‌లో

మొదటి పేజీ తరువాయి

దేశాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

**మయన్మార్, బ్యాంకాక్‌లలో భారీ భూకంపం.. అత్యవసర స్థితి ప్రకటన**

''మయన్మార్, థాయ్‌లాండ్‌లో భూకంప పరిస్థితులపై ఆందోళనగా ఉంది. అక్కడి ప్రజలంతా సురక్షితంగా ఉండాలని ప్రార్థిస్తున్నా. వారికి అవసరమైన సాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉంది. సహాయక చర్యలపై ఆయా దేశాల ప్రభుత్వాలతో నిరంతరం సంప్రదింపులు జరపాలని కేంద్ర విదేశాంగ శాఖను కోరా'' అని మోదీ 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చారు.
మయన్మార్‌లో శుక్రవారం నిమిషాల వ్యవధిలో రెండు భారీ భూకంపాలు సంభవించాయి. రిక్టర్ స్కేలుపై వీటి తీవ్రత 7.7గా నమోదైంది. ఈ ప్రభావంతో థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో 7.3 తీవ్రతతో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఈ విపత్తుతో ఇరు దేశాల్లో అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు.

## .. తెలంగాణకు అతి పెద్ద ఆస్తి

మొదటి పేజీ తరువాయి

చేస్తున్నాం. టెక్నాలజీ అంటేనే ప్రపంచం హైదరాబాద్ వైపు చూడాలి. అలా చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక మంది పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు. వారికి ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటాం. పారిశ్రామికవేత్తలు ఎదిగితే... రాష్ట్రం కూడా వృద్ధి చెందుతుంది. ప్రతిభగల యువతే తెలంగాణకు ఉన్న అతి పెద్ద ఆస్తి'' అని అన్నారు.

## విదేశీ సంస్థల కోసం చైనా ద్వారాలు

మొదటి పేజీ తరువాయి

హెచ్చరించారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో బహుళ పక్ష వైఖరి మాత్రమే సరైన ఎంపిక అని పేర్కొన్నారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన పన్నులను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు.

ఈ భేటీ సందర్భంగా ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలు పాటించడంతోపాటు.. వ్యాపారాలు, పెట్టుబడుల్లో సరళీకరణను కొనసాగిస్తామని జిన్‌పింగ్ హామీ ఇచ్చారు. అంతేకాదు.. విదేశీ సంస్థలు చైనాలో ప్రయోజాలను, సామర్థ్యాలను మెరుగుపర్చుకుని.. ప్రపంచ వాణిజ్య పోటీలో లబ్ధి పొందాలని సూచించారు. విదేశీ సంస్థలే మూడో వంతు చైనా ఎగుమతులు, దిగుమతులకు కారణమని వెల్లడించారు. నాలుగో వంతు విలువ జోడింపు, ఏడింట ఒకటో వంతు పన్ను, 3 కోట్ల ఉద్యోగాలను ఈ సంస్థలు కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు.

విదేశీ సంస్థలకు చైనా ద్వారాలు మరింత తెరుచుకుంటాయని జిన్‌పింగ్ చెప్పారు. అమెరికాచైనా వాణిజ్య ఉద్రిక్తతలను చర్చల ద్వారా పరిష్కరించుకుంటామని వెల్లడించారు. విదేశీ పెట్టుబడులకు చైనా సురక్షితమైన, సుస్థిరమైన ప్రదేశమన్నారు. అంతేకాదు.. 'నేడు చైనాలో పెట్టుబడి పెట్టడమంటే.. రేపటికి మదుపు చేయడమే' అని అభివర్ణించారు.





అలంగిర్ మజీద్ లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

## రంజాన్ పండుగకు ఇబ్బందులు లేకుండా వసతుల కల్పన : జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
రంజాన్ పండుగను పురస్కరించుకొని మసీదుల వద్ద ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు వసతులను కల్పిస్తున్నామని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు ,వేడుకల నిర్వహణకు ఎటువంటి సమస్యలు లేకుండా అన్ని సౌకర్యాలను జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో కల్పిస్తామన్నారు. జోన్ పరిధిలోని మాదాపూర్ డివిజన్ కాకతీయ హిల్స్ అలంగీర్ మసీదును అధికారుల బృందం, మసీద్ ట్రస్ట్ సభ్యులతో కలిసి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదు వద్ద ప్రత్యేక పారిశుధ్య చర్యలను చేపట్టాలని ,పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని అధీకారులను ఆదేశించారు .వీధి దీపాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని ,గుంతలు పడ్డ రహదారులకు తక్షణ మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో మసీదుకు ప్రార్థనలు చేసేందుకు ముస్లింలు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ఆదేశించారు. కాకతీయ హిల్స్ రోడ్ నెంబర్ 11 నుంచి శ్రావణి హాస్పిటల్ గుట్టల బేగంపేట్ వరకు అనుసంధాన రహదారి నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని, నాణ్యతతో సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన స్పష్టం చేశారు. పనులపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. మియాపూర్ లో పరిధిలోని పెదకుడి చెరువు, పటేల్ చెరువు, కుడికుంట చెరువులను పరిశీలించిన జోనల్ కమిషనర్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ మోహన్ రెడ్డి ,ఏసిపి నాగిరెడ్డి, డిఈ శ్రీదేవి, వైద్యాధికారి డాక్టర్ రవి, ఏఈ ప్రశాంత్, ఈద్గా కమిటీ ప్రతినిధులు రియాజ్ తదితరులు పాల్గొన్నారు.




కవి సమ్మేళనంలో ప్రసంగిస్తున్న కవులు

## ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
ఉగాది పర్వదిన వేడుకలను పురస్కరించుకొని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చందానగర్ లో గల శ్రీ విశాఖ శారదా పీఠ పాలిత వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో శుక్రవారం కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర స్వామి దేవాలయం పాలకమండలి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ సుదర్శన సత్యసాయి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కళాసింధు, డాక్టర్ ఆలపాటి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాస్య బ్రహ్మ, పాత్రికేయుడు డాక్టర్ శంకరనారాయణ, అతిథులుగా హైదరాబాదు సెంట్రల్ యూనివర్శిటీ తెలుగుశాఖ

ఆచార్య బాశెట్టి లత,, డాక్టర్ ములుగు అంజయ్య శతావధాని, చిత్రకవితా సామ్రాట్ చింతా రామకృష్ణారావు, సంచాలక చక్రవర్తి కటకం వెంకటరామశర్మ, ఆర్కిటిక్ యెండూరి సురేష్‌బాబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలను నిర్వహించడం అనాదిగా వస్తున్న సనాతన సాంప్రదాయం అని అన్నారు. నక్షత్ర గమనానికి ప్రతీక. తన ఊహాశక్తి, కల్పనాశక్తులనే మనో నేత్రాలతో దేనినైన దర్శించి ముగ్ధ మనోహరముగా, సరళంగా, భావయుక్తంగా, వచన, పద్యరూపాలలో వెల్లడించే వాడే కవి అని, కవి నిత్య నూతన సృష్టి చేస్తూ ఉంటాడన్నారు.. ఈ వసంతఋుతువు నిత్య నూతనానికి ప్రతీక అని, వసంతకాలమున కలిగేటటువంటి సహజసిద్ధమైన, ప్రకృతి పరమైన మార్పులకు అనుగుణంగా నూతన ఉత్తేజంతో ప్రతిక్షణం కవిత్వాన్ని పండిస్తాడని తెలిపారు. ఈ సందర్భంగా సుప్రసిద్ధులైన కవికోకిలలు 63 మంది తమ కవితా మాధుర్యాన్ని వినిపించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం కవులను సాంప్రదాయబద్ధంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విజయలక్ష్మి, వాణి సాంబశివరావు, అమ్మయ్య చౌదరి, పాలం శ్రీను, జనార్ధన్, జిల్ మల్లేష్, నందూరి వెంకటేశ్వర రాజు, శివరామకృష్ణ, జీవి. రావు, సత్యనారాయణ, భమిడిపాటి తదితరులు పాల్గొన్నారు

# ఆసియా కరాటే పోటీలు-2027ను నగరంలో నిర్వహించేందుకు కృషి

**గచ్చిబౌలి స్టేడియంలో కొనసాగుతున్న కియో నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్**

**పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహం కల్పిస్తుందని, 2027లో జరిగే ఆసియా కరాటే పోటీలను హైదరాబాద్ వేదికగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి స్టేడియంలో 4వ కియో జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ 2025 పోటీలు ఘనంగా కొనసాగుతున్నాయి. కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్, తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డిఓ అసోసియేషన్ లు నిర్వహిస్తున్న ఈ పోటీలు ఈనెల 26వ తేదీన ప్రారంభం కాగా, మార్చి 29వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ ఛాంపియన్ షిప్ లో దేశ వ్యాప్తంగా ఉన్న 29 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన దాదాపు 1500మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఈ పోటీల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, టిపిసిసి అధ్యక్షుడు, టీఎస్ కేడిఏ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ లు ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ ప్రసాద్ కుమార్ లకు నిర్వాహకులు గౌరవ బ్లాక్ బెల్టులను ప్రధానం చేయగా, మంత్రి, స్పీకర్ లు కరాటే విన్యాసాలను స్టేజీ మీద ప్రదర్శించి విద్యార్థులను ఉత్సాహపరిచారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడలకు అధిక ప్రోత్సాహం కల్పిస్తున్నారని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలనే ఏకైక లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్పోర్ట్స్ ను ప్రోత్సహించే విధంగా మండల, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించే అన్ని చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. 2027లో జరిగే ఆసియా కరాటే ఛాంపియన్ షిప్ పోటీలను నగరంలో నిర్వహించేందుకు కృషి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, అందుకు సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ లో పాల్గొన్న బాక్సర్ నిఖత్ జరీన్ మాట్లాడుతూ కరాటే పోటీలను వైభవంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. ఇటువంటి పోటీల ద్వారా మన క్రీడాకారుల అంకితభావం, నైపుణ్యం దేశ వ్యాప్తంగా ఉన్న కరాటే సమాజానికి తెలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ చైర్మన్ శివసేనారెడ్డి, కియో అధ్యక్షుడు భరత్ శర్మ, ఓబిసి డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జె. జైపాల్, కార్పొరేటర్లు, జగదీశ్వర్ గౌడ్, రాగం నాగేందర్ యాదవ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, శేరిలింగంపల్లి కోఆర్డినేటర్ రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ ప్రసాద్ కుమార్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లు




కరాటే దుస్తులు ధరించి, వేదిక మీద కరాటే విన్యాసాలతో మంత్రి ప్రభాకర్, స్పీకర్ ప్రసాద్ కుమార్

# పని ఒత్తిడి తట్టుకోలేక...

**కేబుల్ బ్రిడ్జీ పైనుంచి దూకి సాఫ్టువేర్ ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం**
**కాపాడిన రెస్క్యూ టీమ్, పోలీసులు**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** పని ఒత్తిడి తట్టుకోలేక ఓ సాఫ్టువేర్ ఉద్యోగిని దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్ మీద నుంచి నీళ్లలో దూకి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన దుర్గం చెరువు బోట్ రెస్క్యూ టీమ్, పోలీసు పెట్రోలింగ్ సిబ్బంది యువతిని కాపాడారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని ఎస్ఆర్ నగర్ కు చెందిన జి.రోజా (27) ఐటి కారిడార్ లోని ఓ సాఫ్టువేర్ సంస్థలో సాఫ్టువేర్ ఉద్యోగిగా పనిచేస్తుంది. శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో తాను పనిచేస్తున్న కార్యాలయం నుంచి నేరుగా కేబుల్ బ్రిడ్జి మీదకు చేరుకున్న రోజా బ్రిడ్జ్ మీద నుంచి దుర్గం చెరువు నీళ్లలోకి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కాగా కేబుల్ బ్రిడ్జీ మీద విధులు నిర్వహిస్తున్న పోలీసు పెట్రోలింగ్ సిబ్బంది, దుర్గం చెరువు లోపల బోటులో గస్తీ నిర్వహిస్తున్న రెస్క్యూ టీమ్ లు వెంటనే స్పందించారు. కేబుల్ బ్రిడ్జీ మధ్యలో నీళ్ల లోతు ఎక్కువగా ఉండగా, సిబ్బంది తీవ్రంగా శ్రమించి రోజాను కాపాడారు. బోటింగ్ సూపర్వైజర్ మనోహర్, డ్రైవర్ విష్ణులు సమయానికి అక్కడికి చేరుకోవడంతో యువతిని నీళ్లలో మునిగిపోకుండా రక్షించి, ఒడ్డుకు తీసుకువచ్చారు. విషయం తెలుసుకొని పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని రోజును విచారించగా, పని ఒత్తిడి కారణంగా తీవ్ర మనోవేదనకు గురయ్యానని, ఈ క్రమంలోనే ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపింది. కాగా చెరువులో దూరడంతో అస్వస్థతకు గురికావడంతో రోజాను స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రోజా ఆరోగ్యం నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు.





రోజా (ఫైల్ )



చెరువులో దూకిన రోజాను కాపాడుతున్న రెస్క్యూ టీమ్

# మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న తెలంగాణ ప్రభుత్వం: చంద్రిక ప్రసాద్

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని శేరిలింగంపల్లి నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చంద్రిక ప్రసాద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు సునీతా రావు పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు శ్రీ జ్యోతి బీమ్ భరత ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గం అధ్యక్షురాలు చంద్రిక ప్రసాద్ ఆధ్వర్యంలో బ్లాక్ ఏ కమిటీ, 121 పార్ట్ కూకట్ పల్లి డివిజన్, ఆల్విన్ కాలనీ డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర మహిళ కాంగ్రెస్ సెక్రెటరీ రమాదేవి, అరుణ, ఏ బ్లాక్ ప్రెసిడెంట్ శ్రీదేవి, శేరిలింగంపల్లి వైస్ ప్రెసిడెంట్ తన్వీర్, జనరల్ సెక్రెటరీ కృష్ణకుమారి, సెక్రెటరీ వల్లి, ఏ బ్లాక్ అధ్యక్షురాలు శ్రీదేవి, కూకట్ పల్లి అధ్యక్షురాలు శ్రీ జ్యోతి, ఆల్విన్ కాలనీ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మితో కలిసి నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రిక ప్రసాద్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకువెళ్లాలని అన్నారు.



నూతన కమిటీ సభ్యులతో చంద్రిక ప్రసాద్ తదితరులు



## నష్టాల్లో ముగిసిన సూచీలు..
# ఈ ఏడాది 5% లాభాలు పంచిన సెన్సెక్స్, నిఫ్టీ

**స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 191, నిఫ్టీ 72 పాయింట్ల చొప్పున నష్టపోయాయి.**

**ఈ-కబురు:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి ట్రేడింగ్ రోజును దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగించాయి. సెన్సెక్స్ 191 పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 72 పాయింట్లు కోల్పోయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలపై ప్రకటన చేయనున్న (ఏప్రిల్ 2) వేళ మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ముఖ్యంగా ఐటీ, ఆటోమొబైల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రభావం చూపించింది.

సెన్సెక్స్ ఉదయం 77,690.69 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,606.43) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 77,185.62 77,766.70 మధ్య కదలాడింది. చివరికి 191.51 పాయింట్లు నష్టంతో 77,414.92 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 72.60 పాయింట్ల నష్టంతో 23,519.35 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.48గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మారుతీ సుజుకీ, ఇన్ఫోసిస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటార్స్, నెస్లే ఇండియా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3077 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202425) చివర్లో సూచీలు నష్టాలు ఎదుర్కొన్నప్పటికీ.. మదుపర్లకు మాత్రం 5 శాతానికి పైగా రెండు సూచీలు ప్రతిఫలాన్ని ఇచ్చాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 7.48 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 5.4 శాతం చొప్పున లాభాలను నమోదు చేశాయి. శని, ఆదివారాలతో పాటు రంజాన్ సందర్భంగా సోమవారం (మార్చి 31) మార్కెట్‌కు సెలవు.




## ఉద్యోగులకు డీఏ పెంపు, ఎలక్ట్రానిక్స్ తయారీకి పీఎల్ఐ
# కేంద్ర కేబినెట్ నిర్ణయాలివే

**కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ 2 శాతం మేర పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది.**

**ఈ-కబురు:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. డియర్‌నెస్ అలవెన్సును 2 శాతం మేర పెంచుతూ ప్రధాని మోదీ నేతృత్వంలో శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సమావేశం అనంతరం కేంద్రమంత్రి అశ్వని వైష్ణవ్ కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. జనవరి 1 నుంచి పెరిగిన డీఏ వర్తిస్తుందని తెలిపారు.

డీఏ సవరణ తర్వాత డీఏ మొత్తం బేసిక్ శాలరీలో 53 శాతం నుంచి 55 శాతానికి పెరగనుంది. దీంతో ఆ మేర ఉద్యోగుల వేతనం పెరగనుంది. డీఏ పెంపుతో 48.66 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, 66.55 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం కలగనుంది. చివరగా గతేడాది జులైలో డీఏను 50 శాతం నుంచి 53 శాతానికి పెంచారు. ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏను కేంద్రం సవరిస్తూ ఉంటుంది. పెరుగుతున్న ధరలకు పరిహారంగా ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ అందజేస్తారు.

నాన్ సెమీ కండక్టర్ ఎలక్ట్రానిక్ విడిభాగాల తయారీని కేంద్రం ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (PLI) పథకం కిందకు తీసుకొచ్చింది. ఇందుకోసం ఆరేళ్లకు గాను రూ.22,919 కోట్లు వెచ్చించనున్నట్లు మంత్రి తెలిపారు. దీనివల్ల సుమారు రూ.59,350 కోట్ల పెట్టుబడులు రానున్నాయని తెలిపారు. దీంతో పాటు ప్రత్యక్షంగా 91 వేల మందికి, పరోక్షంగా మరికొంతమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి (ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు) పొటాష్, పాస్ఫేట్ ఫెర్టిలైజర్లకు రూ.37,216 కోట్లు సబ్సిడీ కింద చెల్లించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

# 2030.. కండక్టర్ ఉద్యోగానికీ ఏఐ!

**ఆ టెక్నాలజీ తెలుసుకుని ఉండటం అవసరం**
**రైతన్నకూ ఏఐ అవసరం పడుతుంది..**
**ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్–2025 నివేదికలో వెల్లడి**
**ఏఐతో కొన్ని ఉద్యోగాలు పెరుగుతాయి..**
**మరికొన్ని తగ్గుతాయని స్పష్టీకరణ**

**ఈ-కబురు, హైదరాబాద్:** ప్రపంచ ఆర్థిక వేదిక ఇటీవల విడుదల చేసిన 'ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ రిపోర్ట్-2025'ఉద్యోగాలకు సంబంధించి పలు ఆసక్తికరమైన వివరాలు వెల్లడించింది. కిందిస్థాయి ఉద్యోగాల్లోకి సైతం ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చొరబడుతోందని, ఫలితంగా 2030 నాటికి కొన్ని రంగాల్లో ఉద్యోగాలు పెరుగుతాయని, మరికొన్ని రంగాల్లో ఉద్యోగాలు క్రమంగా కనుమరుగయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

2030 నాటికి బస్ కండక్టర్ వంటి ఉద్యోగానికి కూడా ఏఐ టెక్నాలజీ తెలుసుకుని ఉండటం అవసరమని, ఆఖరుకు వ్యవసాయం చేసే వాళ్ళకూ ఏఐ టెక్నాలజీ అవసరం ఏర్పడుతుందని ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ (ఉద్యోగాల భవిష్యత్తు) రిపోర్టు పేర్కొంది. జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో సీట్లు పెంచాలని, విద్యార్థుల్లో ఆ మేరకు నైపుణ్యం పెంచాలని సూచించింది.

2023లో సేకరించిన లెక్కల ప్రకారం భారత్‌లో 4.16 లక్షల మంది మాత్రమే ఏఐ నిపుణులు ఉన్నారు. కాగా 2025 చివరి నాటికి 6.29 లక్షలు 2026 నాటికి 10 లక్షల ఏఐ నిపుణులు అవసరమని పేర్కొంది. ఈ మేరకు కంప్యూటర్ కోర్సుల్లో సిలబస్‌ను మార్చాలని ఏఐ ఆధారిత పరిశ్రమల తోడ్పాటుతో సిలబస్‌కు రూపకల్పన చేయాలని సూచిస్తోంది.

అంతర్జాతీయ యూనివర్సిటీలు ఇప్పటికే ఈ బాటలో పయనిస్తున్నాయి. అమెరికా స్కూల్ స్థాయి నుంచే ఏఐపై బోధన చేస్తోంది. భారత్ కూడా ఈ దిశగా పయనించాల్సిన అవసరం ఉందని నిపుణులు అంటున్నారు.

## జీతాల పెంపుపై గూగుల్
# ఉద్యోగుల అసంతృప్తి

**గూగుల్ జీతాల పెంపుపై కంపెనీ ఉద్యోగులు అసంతృప్తిగా ఉన్నారు. ఈ విషయాన్ని బిజినెస్ ఇన్‌సైడర్ తన కథనంలో పేర్కొంది.**

**ఈ-కబురు:** ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్‌లో పనిచేసే ఉద్యోగులు జీతాల పెంపుపై అసంతృప్తిగా ఉన్నారు. వారు ఆశించిన స్థాయిలో ఈ సంవత్సరం జీతాల పెంపు లేకపోవడమే ఇందుక్కారణంగా తెలుస్తోంది. ఈ అంశాన్ని సంస్థ ఉద్యోగులు ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు బిజినెస్ ఇన్‌సైడర్ తన కథనంలో పేర్కొంది.

మార్చి 25న జరిగిన సమావేశంలో జీతాల పెంపు విషయం చర్చకు వచ్చింది. ఇందులో చాలామంది ఉద్యోగులు తాజా పెంపుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. కంపెనీ ఆర్థిక సామర్థ్యం మెరుగ్గా ఉన్నప్పటికీ 2025 సంవత్సరానికి గానూ ప్యాకేజీని స్వల్పంగా పెంచినట్లు తెలిపారు. ముఖ్యంగా జీవన వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో గణనీయమైన జీతాల పెరుగుదల లేకపోవడంతో నిరాశ చెందారు. ఈవిషయంపై గూగుల్ వైస్ ప్రెసిడెంట్ జాన్ కేసీ స్పందించారు. 80 శాతం కంటే ఎక్కువమంది ఉద్యోగులు 2025లో తమ వేతనాల్లో గత ఏడాదితో పోలిస్తే పెరుగుదల చూశారని తెలిపారు. అయితే నాన్‌టెక్నికల్‌తో పాటు కొన్ని విభాగాల్లోని వాళ్లు మాత్రం తక్కువ ప్యాకేజీలు అందుకున్నట్లు ఆయన అంగీకరించారు.




**తక్కువ జీతాల పెంపును ఎదుర్కొన్న ఉద్యోగులకు మెరుగైన వేతనం చెల్లించాలని గూగుల్ కోరుకుంటోందని జాన్ కేసీ పేర్కొన్నారు. అయితే అధిక పనితీరు కనబరిచిన వారిని ప్రోత్సహించేలా ఈ పెంపు ఉంటుందని తెలిపారు. గూగుల్ జీతాల పెంపు గత ఏడాదిలో పెంచిన 8-10 శాతం జీతంతో పోలిస్తే కేవలం 3 శాతం మాత్రమే పెంచినట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి. ఇదిలాఉండగా.. గూగుల్ గతేడాది డిసెంబర్‌లో పెద్దఎత్తున ఉద్యోగులను తొలగించింది. మేనేజర్, డైరెక్టర్లు, వైస్ ప్రెసిడెంట్ హోదాల్లో పనిచేస్తున్న వారిలో 10 శాతం మందికి లేఆఫ్‌లు ప్రకటించింది. ఏఐ సంస్థల నుంచి పోటీ పెరుగుతున్న వేళ తన సామర్థ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొంది.**

# 'ఆటో' టారిఫ్‌ల ప్రభావం అంతంతే..



**అమెరికాకు ఎగుమతులు తక్కువగానే ఉండటం కారణం దేశీ ఎగుమతిదార్లకు సదవకాశం... జీటీఆర్ఐ అంచనా**

**ఈ-కబురు ,న్యూఢిల్లీ:** వచ్చే నెల నుంచి వాహనాలు, ఆటో విడిభాగాలపై అమెరికా విధించబోయే 25 శాతం దిగుమతి సుంకాల ప్రభావం భారతీయ సంస్థలపై అంతంత మాత్రంగానే ఉండొచ్చని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. మరోవైపు దేశీ ఎగుమతిదారులకు దీనివల్ల వ్యాపార అవకాశాలు మరింతగా పెరగడానికి కూడా ఆస్కారం ఉందని పేర్కొన్నారు.

2024 సంవత్సరంలో భారతీయ ఆటో, ఆటో విడిభాగాల ఎగుమతులను విశ్లేషించిన మీదట ఈ మేరకు అంచనా వేస్తున్నట్లు వివరించారు. ఏప్రిల్ 3 నుంచి కంప్లీట్లీ బిల్ట్ వెహికల్స్ (సీబీయూలు), ఆటో విడిభాగాలపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో జీటీఆర్ఐ అంచనాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

2024 గణాంకాల ప్రకారం భారత్ సుమారు 8.9 మిలియన్ డాలర్ల విలువ చేసే వాహనాలను అమెరికాకు ఎగుమతి చేసింది. ఇది మొత్తం 6.98 బిలియన్ డాలర్ల వాహన ఎగుమతుల్లో 0.13 శాతమే. అలాగే, మొత్తం ట్రక్కుల ఎగుమతుల్లో అమెరికా మార్కెట్ వాటా 0.89 శాతమే. ఇలా అమెరికాకు వాహనాల ఎగుమతులు నామమాత్రమే కాబట్టి, మనపై టారిఫ్‌ల ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని శ్రీవాస్తవ వివరించారు.

### ఆందోళనలో విడిభాగాల సంస్థలు

**టారిఫ్‌ల ప్రభావం వాహన తయారీ సంస్థల కన్నా విడిభాగాల తయారీ సంస్థలపైనే ఎక్కువగా ఉండొచ్చని పరిశ్రమ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. అమెరికాకు భారత్ నుంచి విడిభాగాల ఎగుమతులు గణనీయంగా ఉండటమే ఇందుకు కారణమని పేర్కొన్నాయి. ప్రస్తుతం ఎక్కువగా ఇంజిన్ విడిభాగాలు, పవర్ ట్రెయిన్‌లు మొదలైన వాటిని అమెరికాకు భారత్ ఎగుమతి చేస్తోంది. పరిశ్రమ వర్గాల ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో ఆ దేశానికి ఆటో విడిభాగాల ఎగుమతులు 6.79 బిలియన్ డాలర్లుగా ఉండగా, దిగుమతులు 1.4 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. మన దిగుమతులపై అమెరికాలో సుంకాలేమీ లేకపోయినప్పటికీ అక్కడి నుంచి వచ్చే ఉత్పత్తులపై భారత్‌లో 15 శాతం సుంకాలు అమలవుతున్నాయి.**

**ఆటో షేర్లకు టారిఫ్ బ్రేక్స్**

ఆటో దిగుమతులపై 25 శాతం ప్రతీకార సుంకాలను విధింపుతో దేశీ ఆటో విడిభాగాల పరిశ్రమలో అనిశ్చితి తలెత్తింది. బ్రిటిష్ లగ్జరీ కార్ల దిగ్గజం జేఎల్‌ఆర్ విలాసవంత మోడల్ కార్లు అమెరికా మార్కెట్లో అత్యధికంగా అమ్ముడవుతున్న కారణంగా దేశీ మాతృ సంస్థ టాటా మోటార్స్‌కు సైతం సెగ తగులుతోంది. దీంతో టాటా మోటార్స్ షేరు తాజాగా 5.5 శాతం పతనమైంది. రూ. 669 వద్ద ముగిసింది.
కార్లతో పోలిస్తే యూఎస్‌కు భారత్ నుంచి ఆటో విడిభాగాలు అధికంగా ఎగుమతి అవుతున్నాయి. దీంతో ఎన్ఎస్ఈలో సోనా కామ్‌స్టార్ షేరు 6.2 శాతం క్షీణించి రూ. 466 వద్ద నిలవగా.. సంవర్ధన మదర్‌సన్ 2.6 శాతం నీరసించి రూ. 131 వద్ద, అశోక్ లేలాండ్ 2.7 శాతం నష్టంతో రూ. 209 వద్ద, భారత్ ఫోర్జ్ 2.3 శాతం క్షీణించి రూ. 1,155 వద్ద ముగిశాయి.

# సోమవారం ప్రత్యేక క్లియరింగ్ సెషన్.. బ్యాంకులకు ఆర్‌బీఐ ఆదేశం

**సోమవారం ప్రత్యేక క్లియరింగ్ సెషన్ నిర్వహించాలని బ్యాంకులకు ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది.**

**ఈ-కబురు:** ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానున్న వేళ బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ఆదేశాలు జారీ చేసింది. మార్చి 31న ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ఆ రోజు నిర్వహించే ప్రత్యేక క్లియరింగ్ కార్యకలాపాల్లో అన్ని బ్యాంకులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించింది. ఆర్థిక సంవత్సరం ముగింపు రోజే ప్రభుత్వ ఆదాయం, చెల్లింపులు పూర్తవ్వాల్సి ఉంటుంది. అందుకే ఆ లావాదేవీలు నిర్వహించే బ్యాంకులు విధులు నిర్వర్తించేలా ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది.

ఒక్క బ్యాంకులే కాదు.. ఈ నెల 29, 30, 31వ తేదీల్లో దేశవ్యాప్తంగా ఆదాయపు పన్ను (IT) విభాగం, సీజీఎస్టీ కార్యాలయాలు పనిచేయనున్నాయి. సోమవారం (31న) రంజాన్ ఉన్నప్పటికీ.. ఈ నెల 31తో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆయా కార్యాలయాలు పనిచేస్తాయి. పెండింగ్‌లో ఉన్న పన్ను సంబంధిత లావాదేవీలను చెల్లింపుదార్లు పూర్తి చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు బ్యాంకింగ్ వర్గాలు తెలిపాయి.

## ర్యాపిడో 'పింక్'..
rapido BIKE TAXI
# 2 లక్షల మంది మహిళా రైడర్లతో..


**ర్యాపిడో సంస్థ తన పింక్ మొబిలిటీ సేవల్ని విస్తరించి 2 లక్షల మంది మహిళా కెప్టెన్లకు ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది.**

**ఈ-కబురు:** ప్రముఖ క్యాబ్ బుకింగ్ సేవల సంస్థ ర్యాపిడో మహిళలకు ఉపాధి అవకాశాలు అందించాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన 'పింక్ మొబిలిటీ' సేవల్ని విస్తరిస్తోంది. దీంతో దేశవ్యాప్తంగా 2 లక్షల మందికి పైగా మహిళలకు స్థిరమైన ఆదాయాన్ని సృష్టించడమే తమ లక్ష్యంగా పేర్కొంది. మహిళలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ సౌలభ్యం కల్పించేందుకు ఈ చొరవ చూపినట్లు కంపెనీ వెల్లడించింది. రానున్న మూడేళ్లలో దీనికి సంబంధించిన ప్రణాళికల్ని అమలు చేయనుంది.

పింక్ మొబిలిటీ విస్తరణ కోసం ఆజాద్ ఫౌండేషన్, శాఖా కన్సల్టింగ్ వింగ్స్‌తో ర్యాపిడో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ త్రిముఖ ఒప్పందం ద్వారా నిరుపేద మహిళలకు ప్రొఫెషనల్ డ్రైవింగ్ నైపుణ్యాలను అందించడం, వారికి ఉద్యోగావకాశాలు కల్పించడం, రవాణా రంగంలో ఆర్థిక సాధికారతను ప్రోత్సహించనుంది. ఈ ప్లాట్‌ఫామ్‌లో మహిళలకు నెలకు గరిష్ఠంగా రూ.25వేల వరకు స్థిరమైన ఆదాయం పొందేలా దీర్ఘకాలిక ఆర్థిక భద్రతను సమకూర్చుతుందని కంపెనీ తెలిపింది. అవకాశాలను సృష్టించడంతో పాటు వారికి ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రస్తుతం ఈ సేవలు దేశంలోని పలు నగరాల్లో అందుబాటులో ఉండగా, త్వరలో మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నట్లు ర్యాపిడో తెలిపింది. 'పింక్ మొబిలిటీ' కింద మహిళా కెప్టెన్లు నడిపే ప్రత్యేక వాహనాలు మహిళా ప్రయాణికులకు సేవలు అందించనున్నాయి. ఈ వాహనాలు ఆటో రిక్షాలు, బైక్ టాక్సీలతో సహా వివిధ రకాలుగా ఉంటాయని సంస్థ పేర్కొంది.





# నితిన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఎలా ఉంది?

**నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్'. ఉగాది కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ ఎలా ఉంది? ఎలాంటి వినోదాన్ని పంచింది.**

**ఈ-కబురు** : రాబిన్‌హుడ్; నటీనటులు: నితిన్, శ్రీలీల, వెన్నెల కిషోర్, రాజేంద్రప్రసాద్, దేవదత్త నాగే, షైన్ టామ్ చాకో, శుభలేఖ సుధాకర్ తదితరులు; సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్; ఎడిటింగ్: కోటి; సినిమాటోగ్రఫీ: సాయి శ్రీరామ్; నిర్మాత: నవీన్ యెర్నేని, యలమంచిలి రవి శంకర్; దర్శకత్వం: వెంకీ కుడుముల; విడుదల: 28




విజయవంతమైన 'భీష్మ' తర్వాత నితిన్ వెంకీ కుడుముల కలయికలో రూపొందిన 'రాబిన్ హుడ్' శుక్రవారం విడుదలైంది. నితిన్ శ్రీలీల జోడీతోపాటు.. క్రికెటర్ డేవిడ్ వార్నర్ పోషించిన అతిథి పాత్ర, కేతిక శర్మ చేసిన అదిదా సర్‌ప్రైజు ప్రత్యేక గీతం మరింత ఆసక్తిని పెంచిన విషయాలు. మరి చిత్రం ఎలా ఉంది? ఏ మేరకు ప్రేక్షకులను మెప్పించింది?

**కథేంటంటే:** రామ్ అలియాస్ రాబిన్‌హుడ్ (నితిన్) ఎవరూ లేని ఓ అనాథ. తనలాంటి తోటి పిల్లలతో కలిసి ఓ అనాథ శరణాలయంలో ఆశ్రయం పొందుతుంటాడు. ఆకలి, అవసరాల కోసం నేరాల బాట పట్టిన రామ్.. తెలివిగా చోరీలు చేస్తూ అనాథ శరణాలయాలకి అండగా నిలుస్తుంటాడు. పెరిగి పెద్దయ్యాక కూడా అదే బాటలోనే అతడి ప్రయాణం కొనసాగుతుంది. బంగారం చోరీ కేసులో ఐపీఎస్ అధికారి విక్టర్ వర్గీస్ (షైన్ టామ్ చాకో) చేతికి చిక్కినట్లే చిక్కి త్రుటిలో తప్పించుకున్న రామ్, కొన్నాళ్లు నేరాలబాట వీడి ఉద్యోగం చేయాలనుకుంటాడు. అలా జాన్ స్నో అలియాస్ జాన్ స్నో (రాజేంద్రప్రసాద్) నడుపుతున్న ఇండియాస్ నంబర్‌వన్ సెక్యూరిటీ ఏజెన్సీలో చేరి, ఆస్ట్రేలియా నుంచి వచ్చిన నీరా వాసుదేవ్ (శ్రీలీల) రక్షణ బాధ్యతల కోసం రంగంలోకి దిగుతాడు. అసలు ఎవరీ నీరా వాసుదేవ్?ఆమె ఇండియాకి ఎందుకొచ్చింది?అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారం చేస్తున్న డ్రగ్ మాఫియా ఆమెని ఎందుకు టార్గెట్ చేసింది?అపాయంలోఉన్న నీరా వాసుదేవ్‌కి రామ్ రక్షణ కల్పించాడా లేదా?అనేది మిగతా కథ.

**ఎలా ఉందంటే:** కొత్తతరం దర్శకులు రెగ్యులర్ ఫార్మాట్‌కు దూరంగా సినిమాలు చేస్తున్న రోజులివి. కథ, కథనాలు.. క్యారెక్టరైజేషన్‌లోనో కొత్తదనం చూపిస్తూ సినిమాలు చేస్తున్నారు. వెంకీ కుడుముల మాత్రం తెలుగు ప్రేక్షకులకు బాగా సుపరిచితమైన కమర్షియల్ టెంప్లేట్ కథతోనే రంగంలోకి దిగాడు. బహుశా తను రాసుకున్న ఫన్ పార్ట్‌పై నమ్మకం వల్ల కావచ్చు! ఆయన గత చిత్రాల్లోనూ ఇదే తరహా ప్రయత్నం కనిపిస్తుంది. కానీ, ఈసారి ఆయన రాసిన హాస్య సన్నివేశాలు ప్రథమార్ధంలో మాత్రమే ఓ మోస్తరు ప్రభావం చూపించాయి. హీరో పాత్రలోనూ కొత్తదనం లేదు. ఆ మాటకొస్తే తెలుగు సినిమాల్లోని హీరోలు దాదాపుగా రాబిన్‌హుడ్‌లే కదా! అవే పాత్రల్నే ఈ సినిమా కాస్త స్టైలిష్‌గా ఆవిష్కరించింది తప్ప అందులో ప్రత్యేకత ఏమీ కనిపించదు.

ద్వితీయార్ధంలో మ్యానిపులేటర్‌గా హీరో... విలన్‌ని ఆడుకునే సన్నివేశాలు కాస్త ఆసక్తిని రేకెత్తిస్తాయి. ఆరంభ సన్నివేశాలు గంజాయి మాఫియాని, రాబిన్‌హుడ్ పాత్ర నేపథ్యాన్ని పరిచయం చేస్తాయి. రాబిన్‌హుడ్ తెలివిగా చేసే ఒకట్రెండు దొంగతనాలతో ఆ పాత్ర టాలెంట్‌ని చూపించే ప్రయత్నం కనిపిస్తుంది. నీరా వాసుదేవ్ పాత్ర ప్రవేశంతో కథలో వేగం పెరుగుతుంది. ఫన్ పార్ట్ అక్కడి నుంచే మొదలవుతుంది. జాన్ స్నో సెక్యూరిటీ ఏజెన్సీ పరిచయం, నీరా వాసుదేవ్ కాంట్రాక్ట్ పొందాక ఇచ్చే బిల్డప్‌లు నవ్విస్తాయి. వెన్నెల కిశోర్ రాజేంద్రప్రసాద్ మధ్య వచ్చే సన్నివేశాలు

ఎవరెలా చేశారంటే: నితిన్ ఇందులో స్టైలిష్‌గా కనిపించాడు. తన నటనలోనూ, డ్యాన్సుల్లోనూ, ఫైట్స్‌లోనూ హుషారు కనిపిస్తుంది. సంపన్న కుటుంబంలో పుట్టి పెరిగిన అమ్మాయి పాత్రలో శ్రీలీల అందంగా కనిపిస్తుంది. అంతే తప్ప ఆమె పాత్రకి పెద్దగా ప్రాధాన్యం లేదు. వెన్నెల కిశోర్, రాజేంద్రప్రసాద్ కామెడీనే సినిమాకి హైలైట్. దేవదత్తా నాగే విలనిజం ఆకట్టుకుంటుంది. అయితే ద్వితీయార్ధంలోకి వచ్చేసరికి ఆ పాత్రని తేల్చేశారు. షైన్ టామ్ చాకో, మైమ్ గోపి పాత్రలు ఆరంభంలో ఆకట్టుకున్నాయి, ఆ తర్వాత సాదాసీదాగా మారిపోతాయి. సాయిశ్రీరామ్ ఛాయాగ్రహణం బాగుంది. జీవీ ప్రకాష్ సంగీతం పర్వాలేదు. నిర్మాణం ఉన్నతంగా ఉంది. దర్శకుడు వెంకీ కుడుముల హాస్యం పరంగా తన పెన్ పవర్‌ని ఓ స్థాయిలో చూపించారు కానీ, కథ, కథనం దగ్గర తేలిపోయారు.

**బలాలు**

+ హాస్యం + నితిన్ స్టైలిష్ అవతారం
+ ద్వితీయార్ధంలో మలుపులు

**బలహీనతలు**

కొత్తదనం లేని కథ, కథనం

**చివరిగా:** 'రాబిన్‌హుడ్' పాతవాడే.. అయినా నవ్వులు పంచుతాడు!

**గమనిక:** ఈ సమీక్షసమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!

## పూరీ జగన్నాథ్ చిత్రానికి నో చెప్పా

# రకుల్‌ప్రీత్ సింగ్

**వివాహం తర్వాత కూడా కెరీర్‌లో రాణిస్తున్నారు నటి రకుల్ ప్రీత్ సింగ్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. పూరీ జగన్నాథ్ చిత్రానికి తాను నో చెప్పానని తెలిపారు.**

**ఈ-కబురు:** వివాహం తర్వాత కూడా కెరీర్‌లో రాణిస్తున్నారు నటి రకుల్ ప్రీత్ సింగ్ . తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారామె. కెరీర్ ఆరంభం, పెళ్లి గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. మోడలింగ్ రోజుల్లో దక్షిణాది చిత్ర పరిశ్రమ గురించి తనకు పెద్దగా ఏమీ తెలియదన్నారు. తొలి సినిమా అవకాశం వచ్చినప్పుడు ఈ పరిశ్రమ గురించి తెలియక ఆసక్తి చూపించలేదన్నారు. పూరీ జగన్నాథ్ చిత్రానికి కూడా నో చెప్పానని వెల్లడించారు.

''కాలేజ్‌లో చదువుకుంటూనే మోడలింగ్ చేశా. ఆ సమయంలో నా ఫొటోలు చూసి కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి తొలి సినిమా అవకాశం వచ్చింది. నిజం చెప్పాలంటే అప్పట్లో నాకు దక్షిణాది చిత్ర పరిశ్రమ గురించి పెద్దగా పరిచయం లేదు. అక్కడి చిత్రాలూ చూడలేదు. దాంతో అవకాశం వచ్చినప్పుడు మొదట ఎంతో ఆలోచించా. వాళ్లు నా తండ్రికి ఫోన్ చేసి మాట్లాడటంతో 'గిల్లి'లో యాక్ట్ చేశా. సినిమా షూటింగ్ వల్ల చదువు విషయంలో కాస్త సమస్యలు తలెత్తాయి. తొలి చిత్రంతోనే నటన ఎంతగానో నచ్చింది. చదువు పూర్తి చేసి సినిమాల్లోనే కొనసాగాలని నిర్ణయించుకున్నా''

**రివ్యూ: వీర ధీర శూర.. విక్రమ్ యాక్షన్ థ్రిల్లర్ ఎలా ఉంది?**

''తొలి సినిమా విడుదలయ్యాక పూరీ జగన్నాథ్ నుంచి ఫోన్ వచ్చింది. ఆయన 70 రోజులు డేట్స్ అడిగారు. దానికి నేను అంగీకరించలేదు. కాలేజ్ ఉందని.. కావాలంటే నాలుగు రోజులు ఇస్తానన్నట్లు చెప్పాను. ఎందుకంటే, సినిమాల్లో ఎన్ని రోజుల వర్క్ ఉంటుందనేది అప్పట్లో నాకు పెద్దగా తెలియదు కాబట్టి అలా మాట్లాడాను. నా ఇబ్బందిని ఆయన అర్థం చేసుకున్నారు. అది మాత్రమే కాదు.. ఆ సమయంలో ఎన్నో సినిమాలు వదులుకున్నా'' అని రకుల్ తెలిపారు.

పెళ్లి గురించి మాట్లాడుతూ.. ''జీవితంలో ప్రతిఒక్కరికి హార్ట్ బ్రేక్స్ ఉంటాయి. వాటినుంచే జీవితానికి సంబంధించిన ఎన్నో పాఠాలు నేర్చుకున్నా. ఆధ్యాత్మికత వైపు అడుగులు వేశా. ఒక వ్యక్తిని బాగా నమ్మి.. విడిపోతే దానంత భయంకరమైన విషయం మరొకటి ఉండదు. ప్రేమ చాలా గొప్పది. నీ జీవితంలో ఏదైనా లోటు ఉంటే అది వేరే వ్యక్తి పూర్తి చేస్తాడని ఎప్పుడూ అనుకోకూడదు. నీ జీవితానికి సంబంధించి నువ్వే అన్నీ అని తెలుసుకోవాలి. అదే విషయాన్ని జాకీని కలిసినప్పుడు మేము మాట్లాడుకున్నాం. మా అభిప్రాయాలు కలిశాయి. కొంతకాలానికి మేమిద్దరం ఒక్కటయ్యాం. పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నాం'' అని ఆమె వివరించారు.

## మలయాళ ఇండస్ట్రీలో బిగ్గెస్ట్ ఓపెనర్‌గా

# 'ఎల్ 2:ఎంపురాన్'..




**ఈ-కబురు:** మోహన్‌లాల్ , పృథ్వీరాజ్ సుకుమారన్ కాంబోలో తెరకెక్కిన చిత్రం 'ఎల్ 2: ఎంపురాన్'. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా యాక్షన్ ప్రియులను మెప్పించింది. మలయాళం ఇండస్ట్రీలోనే బిగ్గెస్ట్ ఓపెనర్‌గా నిలిచింది. మార్చి 27న విడుదలైన ఈ సినిమా తొలిరోజు దేశవ్యాప్తంగా రూ.22 కోట్లు వసూళ్లు చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఇప్పటివరకూ మలయాళంలో ఏ చిత్రానికి ఈ స్థాయిలో వసూళ్లు రాలేదని విశ్లేషకులు అంటున్నారు . తాజాగా దీని అడ్వాన్స్ బుకింగ్స్ వివరాలను టీమ్ అధికారికంగా ప్రకటించింది. అడ్వాన్స్ బుకింగ్స్‌లో ఈ సినిమా రూ.80 కోట్లు వసూళ్లు చేసిందని తెలిపింది. ఈ వారంతంలో భారీ వసూళ్లు సొంతం చేసుకునే అవకాశం ఉన్నట్లు అభిమానులు భావిస్తున్నారు.

**రివ్యూ: ఎల్2:ఎంపురాన్.. మోహన్‌లాల్ యాక్షన్ థ్రిల్లర్ ఎలా ఉంది?**

పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో మోహన్‌లాల్ హీరోగా తెరకెక్కిన 'లూసిఫర్'కు సీక్వెల్‌గా 'ఎల్ 2:ఎంపురాన్' తెరకెక్కింది. ఇందులో మోహన్‌లాల్ తన నటనతో ఎప్పటిలానే ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అలాగే ఎలివేషన్స్ సినిమాకే హైలైట్‌గా నిలిచాయి. ఐమాక్స్ ఫార్మాట్ లో వచ్చిన తొలి మలయాళీ సినిమాగా ఇది విడుదలకు ముందే రికార్డు నెలకొల్పిన విషయం తెలిసిందే.



# విజయాలు సాధించడమే సక్సెస్ కాదు..

**సక్సెస్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు నటి సమంత . విజయాలు సాధించడం మాత్రమే సక్సెస్ కాదని ఆమె అన్నారు.**

**ఈ-కబురు:** గత కొన్ని రోజులుగా సిడ్నీలో పర్యటిస్తున్నారు నటి సమంత . ఇటీవల అక్కడ జరిగిన ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ సిడ్నీలో ఆమె పాల్గొన్నారు. ఎన్నో ఇబ్బందులు ఎదురైనప్పటికీ కెరీర్‌లో రాణించడంపై మాట్లాడారు. సక్సెస్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సక్సెస్ అంటే విజయాలు సాధించడం మాత్రమే కాదని.. సామాజిక పట్టింపులు, కట్టుబాట్ల నుంచి విముక్తి పొందడమంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. స్వేచ్ఛగా జీవించడం, మూస ధోరణి భావనలను సవాలు చేయడం గురించి ఆమె హైలైట్ చేస్తూ మాట్లాడారు.

''నా దృష్టిలో సక్సెస్ అంటే స్వేచ్ఛ, స్వతంత్రం. నేను విజయవంతమయ్యానని ఇతరులు చెప్పేవరకు వేచి ఉండను. సక్సెస్ అంటే.. మనకు నచ్చినవిధంగా జీవించడం అలాగే, మన అభిరుచికి తగ్గట్టుగా పనులు చేయడం. అంతేకానీ, మహిళలను ఒకచోట బంధించి ఇది చేయాలి? ఇది చేయకూడదు అని చెప్పడం కాదు. నిజ జీవితంలో ఎన్నో రకాల పాత్రలను పోషిస్తూ అన్నింటిలో సమర్థంగా రాణించగలగడమే సక్సెస్'' అని సమంత తెలిపారు. కెరీర్ పరంగా తాను నిర్మాతగా మారడంపైనా ఆమె మాట్లాడారు. నూతన టాలెంట్, అద్భుతమైన కథలను ప్రేక్షకులను అందించేందుకే తాను నిర్మాణరంగంలోకి అడుగుపెట్టానని అన్నారు.

సిడ్నీ పర్యటనలో భాగంగా ఆమె ఇటీవల అక్కడి యువతతో మాట్లాడారు. తాను కన్న కలల్లో ఒకటి నెరవేరలేదన్నారు. చదువుకునే రోజుల్లో ఆస్ట్రేలియా వెళ్లాలని.. సిడ్నీ యూనివర్సిటీలో చదువుకోవాలని తాను అనుకున్నానని కాకపోతే అది నెరవేరలేదని ఆమె చెప్పారు. అనుకోకుండా తాను సినిమాల్లోకి అడుగుపెట్టానని తెలిపారు. నటిగా ఇంతమంది అభిమానం పొందడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ కలల సాకారం దిశగా అడుగులు వేయాలని సూచించారు. సినిమాల విషయానికి వస్తే.. సమంత ఇటీవల 'సిటడెల్.. హనీ బన్నీ'తో అలరించారు. ప్రస్తుతం ఆమె 'రక్త్ బ్రహ్మాండ్' అనే యాక్షన్ సిరీస్ కోసం వర్క్ చేస్తున్నారు. ఇటీవల ఆమె 'మా ఇంటి బంగారం' అనే సినిమా చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు, ఆమె నిర్మాతగా వ్యవహరిస్తోన్న 'శుభం' అనే చిత్రం త్వరలో విడుదల కానుంది.

## మెగా ఫోన్ పట్టనున్న స్టార్ హీరో.. భారీ ప్రాజెక్ట్‌కు రంగం సిద్ధం



**ఈ-కబురు:** హృతిక్ రోషన్ హీరోగా తెరకెక్కిన 'క్రిష్' సిరీస్ సినిమాలు మంచి ప్రేక్షకాదరణతో బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించాయి. ఇప్పటికే విడుదలైన మూడు భాగాలు భారీ విజయాన్ని అందుకోగా నాలుగో భాగం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఫ్యాన్స్‌ను సర్‌ప్రైజ్ చేస్తూ ఈ సినిమా గురించి అప్‌డేట్ పంచుకున్నారు హృతిక్ తండ్రి, దర్శకుడు రాకేశ్ రోషన్. 'క్రిష్ 4'కు హృతిక్ దర్శకత్వం వహించనున్నట్లు స్పష్టంచేశారు.''25 ఏళ్ల కిత్రం నిన్ను యాక్టర్‌గా ఇండస్ట్రీకి పరిచయం చేశాను. ఇప్పుడు మళ్లీ 25 ఏళ్ల తర్వాత ఆదిత్యచోప్రా, నేను కలిసి నిన్ను డైరక్టర్‌గా పరిచయం చేస్తున్నాం. దర్శకుడిగానూ నువ్వు ఎన్నో విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నా. ప్రతిష్టాత్మకమైన 'క్రిష్ 4'కు నువ్వు దర్శకత్వం వహించడం ఆనందంగా ఉంది'' అని రాకేశ్ రోషన్ పోస్ట్ పెట్టారు. దీంతో బాలీవుడ్ ప్రముఖులు ఈ స్టార్ హీరోకు ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. దీనిపై అప్‌డేట్స్ కోరుతూ అభిమానులు కామెంట్స్ పెడుతున్నారు.




# అప్పటికి మెస్సి ఆడాలని..

**సూపర్‌స్టార్ లియోనల్ మెస్సి రెండు మ్యాచ్‌లకు దూరమైనా.. దక్షిణ అమెరికా క్వాలిఫయర్స్‌లో సత్తా చాటి 2026 ఫుట్‌బాల్ ప్రపంచకప్‌నకు అర్హత సాధించింది అర్జెంటీనా. అయితే వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్ నాటికి మెస్సి కోలుకుని పునరాగమనం చేస్తాడని ఆ జట్టు ఆశతో ఉంది.**

**ఈ-కబురు, బ్యూనస్ ఎయిర్స్:**
సూపర్‌స్టార్ లియొనల్ మెస్సి రెండు మ్యాచ్‌లకు దూరమైనా.. దక్షిణ అమెరికా క్వాలిఫయర్స్‌లో సత్తా చాటి 2026 ఫుట్‌బాల్ ప్రపంచకప్‌నకు అర్హత సాధించింది అర్జెంటీనా. అయితే వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్ నాటికి మెస్సి కోలుకుని పునరాగమనం చేస్తాడని ఆ జట్టు ఆశతో ఉంది. ''2026 ఫుట్‌బాల్ ప్రపంచకప్‌నకు ఇంకా చాలా సమయం ఉంది. ఏం జరుగుతుందో చూడాలి. మెస్సికి సమయం ఇవ్వాలి. ఏం చేయాలో అతడే నిర్ణయించుకుంటాడు'' అని అర్జెంటీనా కోచ్ లియోనల్ స్కాలోని చెప్పాడు. ''మెస్సి ఆడితే కచ్చితంగా రెండు, మూడు గోల్స్ అదనంగా కొట్టేవాళ్లం'' అని స్ట్రైకర్ జులియన్ అల్వరెజ్ అన్నాడు. ''మా జట్టులో నంబర్ 10 మెస్సి బరిలో దిగితే మిగిలిన ప్లేయర్లు కూడా రాణిస్తారు'' అని మిడ్‌ఫీల్డర్ డిపాల్ పేర్కొన్నాడు. తాజా క్వాలిఫయర్స్ మ్యాచ్‌లో అర్జెంటీనా 41తో బ్రెజిల్‌ను చిత్తు చేసి ప్రపంచకప్ బెర్తు సొంతం చేసుకుంది. అంతకుముందు ఉరుగ్వేపై 10తో నెగ్గింది. ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ మెస్సి ఆడలేదు. 2022 ప్రపంచకప్‌లో అర్జెంటీనాను విజేతగా నిలిపిన 37 ఏళ్ల మెస్సి.. ఆరో టోర్నీలో ఆడాలని భావిస్తున్నాడు.




# ధోనీని చూసే నేర్చుకున్నా: గుకేశ్

**ఎంత ఒత్తిడిలోనైనా ప్రశాంతంగా ఉండగలగడం భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, మిస్టర్ కూల్ మహేంద్రసింగ్ ధోనిని చూసే నేర్చుకున్నానని చెస్ ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ తెలిపాడు.**

**ఈ-కబురు, చెన్నై:**
ఎంత ఒత్తిడిలోనైనా ప్రశాంతంగా ఉండగలగడం భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, మిస్టర్ కూల్ మహేంద్రసింగ్ ధోనిని చూసే నేర్చుకున్నానని చెస్ ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ తెలిపాడు. ''ఒత్తిడిలో ఎలా ఉండాలనే విషయంలో మహేంద్రసింగ్ ధోనినే స్ఫూర్తి. నేను అన్నింటికి ఎక్కువగా స్పందించను. ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కోగలను. నా కెరీర్‌పై ధోని ప్రభావం ఎంతో ఉంది'' అని గుకేశ్ తెలిపాడు. శ్రీలంకతో 2011 ప్రపంచకప్ ఫైనల్లో ధోని సిక్స్‌తో మ్యాచ్‌ను ముగించిన తీరు తనకు ఎప్పుడూ గుర్తుండే విషయమని గుకేశ్ అన్నాడు. ''2011 ప్రపంచకప్ ఫైనల్ ప్రతి భారత అభిమానికి ఓ మధురస్మృతి. ఫైనల్లో సిక్స్ కొట్టి మహి భారత్‌ను గెలిపించిన తీరు ఎప్పుడూ గుర్తుంటుంది'' అని గుకేశ్ పేర్కొన్నాడు. గతేడాది డింగ్ లీరెన్‌పై గెలిచి గుకేశ్ ప్రపంచ ఛాంపియన్ అయిన సంగతి తెలిసిందే. భారత్ తరఫున విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత అతడికే దక్కింది.



# రీతికకు రజతం

**ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో రీతిక హుడా రజతం గెలుచుకుంది. గురువారం మహిళల 76 కిలోల విభాగం ఫైనల్లో ఆమె 6-7తో మెడిట్ కిజీ (కజకిస్థాన్) చేతిలో పోరాడి ఓడింది. ఈ పోరులో ఆరంభం నుంచి భారత రెజ్లర్ దూకుడుగా ఆడింది.**

**ఈ-కబురు,అమ్మాన్ (జోర్డాన్):**
ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో రీతిక హుడా రజతం గెలుచుకుంది. గురువారం మహిళల 76 కిలోల విభాగం ఫైనల్లో ఆమె 67తో మెడిట్ కిజీ (కజకిస్థాన్) చేతిలో పోరాడి ఓడింది. ఈ పోరులో ఆరంభం నుంచి భారత రెజ్లర్ దూకుడుగా ఆడింది. డబుల్ లెగ్ ఎటాక్‌తో 62తో నిలిచి తేలిగ్గా గెలిచేలా కనిపించింది. కానీ ఆఖరి పది సెకన్లలో తడబడి స్వర్ణాన్ని కోల్పోయింది. అంతకుముందు సెమీస్‌లో రీతిక 60తో సెయోన్ జెంగ్ (కొరియా)ను చిత్తు చేసింది. మాన్సి (68 కేజీ), ముస్కాన్ (59 కేజీ) కాంస్య పతకాలు సాధించారు. కాంస్య పోరులో మాన్సి 122తో ఐరినా (కజకిస్థాన్)ను ఓడించింది. మరోవైపు ముస్కాన్ 40తో ఆల్టిన్ (మంగోలియా)ను చిత్తు చేసింది. 55 కేజీల్లో నిషుకి నిరాశ ఎదురైంది. కాంస్యం కోసం జరిగిన పోరులో ఒట్‌గాన్‌టుయా (మంగోలియా) చేతిలో ఆమె ఓడింది. అంకుష్ (50 కిలోలు) రెపిచేజ్ రౌండ్‌కు వెళ్లినా.. గాయంతో వైదొలిగింది.

## సొంతగడ్డపై చిత్తుగా ఓడిన చెన్నై..

# బెంగళూరుకు రెండో విజయం

**చెపాక్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 50 పరుగుల తేడాతో విజయం సాధించింది.**

**ఈ-కబురు,చెన్నై:**
చెపాక్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు అదరగొట్టింది. చెన్నై సొంతగడ్డపై 17 ఏళ్ల తర్వాత ఆర్సీబీ విజయం సాధించింది. 197 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన చెన్నై 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 146 పరుగులకే పరిమితం అయింది. దీంతో ఆర్సీబీ 50 పరుగుల తేడాతో గెలుపొందింది. చెన్నై టీమ్‌లో రచిన్ రవీంద్ర (41: 31 బంతుల్లో 5 ఫోర్లు) టాప్ స్కోరర్. రాహుల్ త్రిపాఠి (5), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (0), దీపక్ హుడా (4), సామ్ కరన్ (8), శివమ్ దూబే (19), అశ్విన్ విఫలమయ్యారు. ధోనీ (30*), జడేజా (25) రాణించారు. బెంగళూరు బౌలర్లలో జోష్ హేజల్ వుడ్ 3, యశ్ దయాల్ 2, లివింగ్‌స్టోన్ 2 వికెట్లు తీయగా, భువనేశ్వర్ కుమార్ ఒక వికెట్ పడగొట్టాడు.




ఓ వైపు పటీదార్ వరుస బౌండరీలు బాదుతుంటే కోహ్లీ సహకారం అందించాడు. ఈ క్రమంలో జట్టు స్కోర్ 117 పరుగుల వద్ద కోహ్లీ ఔటయ్యాడు. అహ్మద్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన కోహ్లీ.. అశ్విన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం స్వల్ప వ్యవధిలో పటీదార్‌ను పతిరన ఔట్ చేశాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన లివింగ్ స్టోన్ (10), జితేశ్ శర్మ (12) పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు. చివర్లో టిమ్ డేవిడ్ (22; 8 బంతుల్లో 1×4, 3×6) హ్యాట్రిక్ సిక్సర్లతో విరుచుకుపడడంతో ఆర్సీబీ భారీ స్కోర్ చేసింది. నూర్ అహ్మద్ 3, పతిరన 2, ఖలీల్ అహ్మద్, రవిచంద్రన్ అశ్విన్ తలో వికెట్ తీశారు.

**తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. రజత్ పటీదార్ (51; 32 బంతుల్లో 4×4, 3×6) అర్ధశతకంతో చెలరేగాడు. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (32; 16 బంతుల్లో 5×4,1×6), విరాట్ కోహ్లీ (31; 30 బంతుల్లో 2×4, 1×6) శుభారంభాన్నిచ్చారు. తొలి ఓవర్‌లోనే ఫిల్ సాల్ట్ వరుసగా 2 బౌండరీలు బాదాడు. తర్వాతి ఓవర్లో మరో 2 ఫోర్లు సహా ఓ సిక్సర్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. జోరు మీదున్న ఈ జోడీని నూర్ అహ్మద్ విడగొట్టాడు. ఐదో ఓవర్ చివరి బంతికి ధోనీ మెరుపు వేగంతో ఫిల్‌సాల్ట్‌ను స్టంపౌట్ చేశాడు. అక్కడికి మూడు ఓవర్ల వ్యవధిలోనే వన్ డౌన్‌లో వచ్చిన పడిక్కల్ (27) అశ్విన్ బౌలింగ్‌లో గైక్వాడ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. రెండో స్థానంలో వచ్చిన పటీదార్‌తో కలిసి.. విరాట్ కోహ్లీ ఇన్నింగ్స్‌ను నిర్మించే ప్రయత్నం చేశాడు.**

## ఫస్ట్ ధోనీకి.. తర్వాతే సీఎస్కేకు సపోర్ట్..
## ఇది వారికి ఇబ్బందికరమే: రాయుడు

**ఎంఎస్ ధోనీ కనీసం ఒక్క బంతిని ఆడటం చూసినా చాలని భావించే సీఎస్కే అభిమానులు కోకొల్లలు. గత సీజన్‌లో అతడి బ్యాట్ నుంచి భారీ సిక్స్‌లు వచ్చిన సంగతి తెలిసిందే.**




**ఈ-కబురు:** చెన్నై సూపర్ కింగ్స్ క్రేజ్‌కు కారణం ఎంఎస్ ధోనీ. సుదీర్ఘంగా ఆ జట్టుతో ప్రయాణిస్తోన్న అతడి కోసమే మైదానాలకు వచ్చేవాళ్లు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికీ ధోనీ బ్యాటింగ్ చూసేందుకు ప్రేక్షకులు పోటీపడతారు. అయితే, ధోనీ క్రేజ్ ముందు సీఎస్కేలోకి కొత్తగా వచ్చే క్రికెటర్లు ఇబ్బందిపడతారని.. వారిపై ఒత్తిడి కూడా ఎక్కువగా ఉంటుందని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు వ్యాఖ్యానించాడు. అసలు సీఎస్కేకు మద్దతు ఇస్తున్నారంటే తొలుత ధోనీ కి ఫ్యాన్స్ అయి ఉంటారని వెల్లడించాడు.

**'ఆర్సీబీ' నాటి సంబరాలకు 'సీఎస్కే' నేడు బదులు తీర్చుకొనేనా?**
''సీఎస్కేలో కొత్తవాళ్లకు ఆరంభంలో కాస్త కష్టంగా అనిపిస్తుంది. ధోనీ కోసం అభిమానులు భారీగా వస్తారు. ఆ మద్దతు అద్భుతం. బ్యాటింగ్‌కు వెళ్లినప్పుడు త్వరగా ఔటై పోవాలని వారు కోరుకుంటారు. అలాగని జట్టు ఓడిపోవాలని కాదు. ధోనీ త్వరగా బ్యాటింగ్‌కు రావాలనేదే వారి ఆకాంక్ష. అందుకే, అతడిని తలా (నాయకుడు) అని పిలుస్తారు. సీఎస్కేపై ధోనీ ప్రభావం చాలా ఎక్కువ. ఆ జట్టు కోసం అతడు చేసిన దానికే పెద్దఎత్తున ఫ్యాన్స్ అయిపోయారు'' అని రాయుడు తెలిపాడు.

**చాలామంది బయటకు చెప్పలేరు..**
''ఐపీఎల్ ఆరంభం నుంచి ధోనీ క్రేజ్‌తోనే సీఎస్కే ముందుకుసాగుతోంది. చాలామంది క్రికెటర్లు తమ మనసులో అనుకొన్న విషయాలను బయటకు చెప్పలేరు. అలాంటివాటిల్లో ధోనీ క్రేజ్ కూడా ఉంటుంది. ధోనీని క్రీజ్‌లో చూడాలనుకొనే



క్రమంలో సొంత జట్టు బ్యాటర్లనే ఔట్ కావాలని కోరుకుంటారు. ఇది కాస్త కొత్తగానే అనిపిస్తుంది. జట్టులోని ఇతర ప్లేయర్లు తమ సత్తా చాటేందుకు వేదికగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. అదే సమయంలో ఒత్తిడి కూడా ఎక్కువగానే ఉంటుంది. దీనిని తప్పించుకోవడం చాలా కష్టం. ధోనీ రిటైర్‌మెంట్ అంశం ఎప్పుడూ క్లిష్టమైందే. అభిమానులను ఈ స్థాయిలో మైదానాలకు రప్పించే స్థాయి కలిగిన క్రికెటర్‌ను మరొకరిని తయారుచేసుకోవాల్సిన అవసరం సీఎస్కేకు ఉంది. ధోనీ ఉండటం వల్ల ప్రతి రోజూ స్టాండ్స్ నిండిపోతున్నాయి. ఈ స్థాయి క్రికెటర్ మరొకరు లేరని భావిస్తున్నా'' అని రాయుడు తెలిపాడు.




## పటీదార్, డేవిడ్ మెరుపులు..
# చెన్నై సూపర్ కింగ్స్ లక్ష్యం 197

**ఐపీఎల్-18 సీజన్‌లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్ ముగిసింది.**

**ఈ-కబురు,చెన్నై:**
ఐపీఎల్ 18 సీజన్‌లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్ ముగిసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. రజత్ పటీదార్ (51; 32 బంతుల్లో 4×4, 3×6) అర్ధశతకంలో చెలరేగాడు. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (32; 16 బంతుల్లో 5×4,1×6), విరాట్ కోహ్లీ (31; 30 బంతుల్లో 2×4, 1×6) శుభారంభాన్నిచ్చారు. నూర్ అహ్మద్ 3 వికెట్లు పడగొట్టగా.. పతిరణ రెండు, ఖలీల్ అహ్మద్, రవిచంద్రన్ అశ్విన్ తలో వికెట్ తీశారు.

బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ జోరుగా ఇన్నింగ్స్ ప్రారంభించింది. తొలి ఓవర్‌లోనే ఫిల్ సాల్ట్ వరుసగా 2 బౌండరీలు బాదాడు. తర్వాతి ఓవర్లో మరో 2 ఫోర్లు సహా ఓ సిక్సర్‌తో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. జోరు మీదున్న ఈ జోడీని నూర్ అహ్మద్ విడగొట్టాడు. ఐదో ఓవర్ చివరి బంతికి ధోనీ మెరుపు వేగంతో ఫిల్‌సాల్ట్‌ను స్టంపౌట్ చేశాడు. అక్కడికి మూడు ఓవర్ల వ్యవధిలోనే తొలి డౌన్‌లో వచ్చిన పడిక్కల్ (27) అశ్విన్ బౌలింగ్‌లో గైక్వాడ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. రెండో డౌన్‌లో వచ్చిన పటీదార్‌తో కలిసి.. విరాట్ కోహ్లీ ఇన్నింగ్స్‌ను నిర్మించే ప్రయత్నం చేశాడు. క్రీజులో నిలదొక్కుకుంటూ స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు.
ఓ వైపు పటీదార్ వరుస బౌండరీలు బాదుతుంటే కోహ్లీ చక్కని సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు 117 పరుగులు జోడించారు. అహ్మద్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించిన కోహ్లీ.. అశ్విన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అక్కడికి స్వల్ప వ్యవధిలోనే పటీదార్ పెవిలియన్‌కు చేరాడు. ఈ వికెట్‌ను పతిరణ దక్కించుకున్నాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన లివింగ్ స్టోన్ (10), జితేశ్ శర్మ (12) పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు. చివర్లో టిమ్ డేవిడ్ (22; 8 బంతుల్లో 1×4, 3×6) హ్యాట్రిక్ సిక్సర్లతో మెరుపులు మెరిపించడంతో ఆర్సీబీ భారీ స్కోరే చేసింది.

## 'ఈడెన్ గార్డెన్స్' పిచ్ వివాదం..
# క్యూరేటర్ యూటర్న్!

**సొంత మైదానాల్లో జరిగే మ్యాచుల్లో తమకు అనుకూలంగా ఉండే పిచ్‌లను తయారుచేయించుకోవడం సాధారణమైన విషయమే. కానీ, కోల్‌కతా ఆడిన మొదటి మ్యాచ్‌కు వాడిన పిచ్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.**

**ఈ-కబురు:** ఐపీఎల్ 2025 సీజన్ తొలి మ్యాచ్ ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్‌కు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు షాక్ ఇచ్చింది. అయితే, ఇక్కడే 'పిచ్' వివాదం మొదలైంది. తాను అడిగినట్లు పిచ్‌ను తయారుచేయలేదని క్యూరేటర్‌ను ఉద్దేశించి కేకేఆర్ సారథి అజింక్య రహానె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. దానిపై స్పందిస్తూ పిచ్ క్యూరేటర్ సుజన్ ముఖర్జీ ''ఐపీఎల్ నిబంధనల ప్రకారం ఫ్రాంచైజీలకు పిచ్‌ను ఫలానావిధంగా తయారుచేయాలని చెప్పే హక్కు లేదు.




అయినా నేను బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి ఇదే కొనసాగుతోంది. భవిష్యత్తులోనూ మారే అవకాశం లేదు. ఆర్సీబీ స్పిన్నర్లు వికెట్లు తీయగలిగినప్పుడు కేకేఆర్ స్పిన్నర్లు ఎందుకు చేయలేకపోయారు? కృనాల్ మూడు వికెట్లు తీశాడు'' అని వ్యాఖ్యానించాడు. దీంతో అతడిపై తీవ్రస్థాయిలో విమర్శలు రాగా, గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై యూటర్న్ తీసుకున్నాడు. తానెప్పుడూ కేకేఆర్ నుంచి వచ్చిన విజ్ఞప్తులను తిరస్కరించలేదని తెలిపాడు.



**అవన్నీ ఇస్తున్నారు.. 'సూపర్ బాల్'కూ అవార్డు ఇస్తే అంతకుముందు రహానె ఏమన్నాడంటే?**
బెంగళూరుతో మ్యాచ్ అనంతరం రహానె మాట్లాడుతూ.. ''పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉంటుందని ఆశించాం. కానీ, అలా జరగలేదు. మ్యాచ్‌కు ముందు ఒకటిన్నర రోజుల పాటు కవర్స్‌తో కప్పి ఉంది. మా జట్టులో నాణ్యమైన స్పిన్నర్లు ఉన్నారు. ఎలాంటి వికెట్ పైనైనా అత్యుత్తమంగా బంతు లేయగలరు'' అని రహానె తెలిపాడు.

**బాగుండు: అశ్విన్**
**''తొలి మ్యాచ్‌కు సంబంధించి ఏ అధికారి లేదా ప్లేయర్ నన్ను సంప్రదించలేదు. ప్రాక్టీస్ సమయంలో కోచ్ మాత్రమే నాతో మాట్లాడారు. పిచ్ ఎలా స్పందిస్తుందని అడిగారు. దానికి సమాధానంగా 'పిచ్ టర్న్ అవుతుంది. అదే సమయంలో బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది' అని చెప్పా. నేనెప్పుడూ కేకేఆర్ నుంచి వచ్చే వాటిని తిరస్కరించలేదు. సుదీర్ఘకాలంగా నాకు మంచి అనుబంధం ఉంది. బీసీసీఐ గైడ్‌లైన్స్ ప్రకారమే పిచ్‌ను తయారుచేశా. నాపై ఆరోపణలు చేసే వారి సంగతి పట్టించుకోను'' అని ముఖర్జీ వెల్లడించారు.**

**అక్కడినుంచి వెళ్లిపోండి: సైమన్ డౌల్**
''సొంత మైదానాల్లో అనుకూలంగా పిచ్‌ను తయారు చేయించుకోలేకపోతే ఇంకెందుకు? వారు స్టేడియాలకు సంబంధించి ఫీజులను కడుతున్నారు. కానీ, హోం టీమ్ అడిగింది క్యూరేటర్ చేయకపోతే ఎలా? అలాంటప్పుడు ఫ్రాంచైజీని వేరే మైదానానికి మార్చేసుకుంటే సరిపోతుంది. అతడి బాధ్యత పిచ్‌ను తయారుచేయడమే. మ్యాచ్‌పై అభిప్రాయాలను వెల్లడించడానికి కాదు